STUDY ABROAD
TOP GLOBAL DESTINATIONS
Free IELTS coaching
GradsUniverse
+91 6301726400

ESTD: 1999
www.voodayam.com
# వుదయం

DOMESTIC & INTERNATIONAL
FLIGHT TICKET
Easy Booking
Best Discounts
Get Your Tickets Now
Call Us & Book : +91 6301726400

హైదరాబాద్ 30-04-2026 గురువారం సంపుటి : 27 | సంచిక : 58 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on

# ఎన్డీయే వైపే ఎగ్జిట్

## తమిళనాడులో మళ్లీ డీఎంకె • కేరళంలో ఈసారి యూడీఎఫ్ కి అవకాశం
## అస్సాంలో తిరిగి హిమంత, పశ్చిమ బెంగాల్ లో తొలిసారి, పుదుచ్చేరిలో మళ్లీ కూటమే




బుధవారంతో ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ప్రచారం, పోలింగ్ కూడా ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగాయి. ప్రతి రాష్ట్ర ఎన్నికలోనూ ప్రజలు ఉత్సాహంగా బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ వివాదాలు పెచ్చరిల్లిన పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రజలు అత్యుత్సాహంతో కదిలి వచ్చి ఓటు వేయడం విశేషం. ప్రతి రాష్ట్రంలోనూ భారీ స్థాయిలో ఓటింగ్ శాతాలు నమోదు కావడంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే భావన వచ్చేలా చేసింది. అయితే, ఎగ్జిట్ పోల్స్ మరో కథ చెబుతున్నాయి. తమిళనాడులో తిరిగి డీఎంకేకే అవకాశముందని తేల్చేయగా, కేరళలో మాత్రం యుడిఎఫ్‌కు అధికారం చేజిక్కించుకునే అవకాశం ఉందని చెబుతున్నాయి. ఇక, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలోనూ, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోనూ ఎన్డీయేదే హవా అని పోల్స్ చెబుతున్నాయి.

# ఇంధన పరివర్తనే మార్గం

**ఈ ముసాయిదా నిబంధనల్లో పెట్రోల్‌లో**
**85 శాతం ఇథనాల్ కలిపే ఇ 85 ఇంధన ప్రతిపాదన**
**భవిష్యత్తులో పూర్తిగా ఇథనాల్‌తో వాహనాలను**
**నడిపే అవకాశం : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**



**వుదయం డెస్క్, ఏప్రిల్ 29 :** ఇరాన్ యుద్ధం, హొర్ముజ్ జలసంధి సంక్షోభం భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన రంగాన్ని అతలాకుతలం చేసింది. ముఖ్యంగా భారత్‌లో, గ్యాస్, పెట్రోల్–డీజిల్‌పై తీవ్రమైన భీతి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత్ ఈ పరిస్థితిని అధిగమించేందుకు కీలక అడుగు వేస్తోంది. పెట్రోల్‌లో అధిక మొత్తంలో ఇథనాల్‌ను కలపడానికి సంబంధించిన నిబంధనల్ని ప్రతిపాదిస్తూ కేంద్రం ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇది అమలయితే భవిష్యత్తులో ఇ85 పెట్రోల్‌తో వాహనాలు నడిచే అవకాశం ఉంది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక కొత్త ముసాయిదా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ముసాయిదా నిబంధనల్లో పెట్రోల్‌లో 85 శాతం ఇథనాల్ కలిపే ఇ 85 ఇంధనాన్ని చేర్చారు. ఇ100ను కూడా ప్రతిపాదించారు,

మిగతా 2లో

## పశ్చిమ బెంగాల్ లో ముగిసిన కీలక ఎన్నికల పోలింగ్

**సాయంత్రం 5 గంటలకు**
**90 శాతం ఓటింగ్ నమోదు**
**మే 4న జరగనున్న**
**ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు**
**రెండవ దశ పోలింగ్‌లో**
**భారీగా ఓటర్లు**
**తరలిరావడంతో**
**స్వల్ప హింసాత్మక ఘటనలు**

5



## సరిగ్గానే ఉన్నాం.. ప్రజలే మారాలి అని కేసీఆర్ ఆలోచిస్తున్నారు

**కాంగ్రెస్ నుంచి మంత్రి పదవి ఆశించలేదు**
**టీజేఎస్‌కు ప్రభుత్వ పదవులు, నామినేటెడ్**
**పోస్టులు ఇవ్వాలి : ఎమ్మెల్సీ కోదండరాం**

**హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఎఎంఎస్) :** కాంగ్రెస్ పార్టీ తనకు మంత్రి పదవి ఇస్తానని చెప్పలేదని.. తాను అడగలేదని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం



చేశారు. కానీ తాము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అ దుగుతున్నామ ని చెప్పారు. ఈసారి తమ పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నట్లు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేదని కోదండరాం చెప్పారు. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పేవాళ్లన్నారు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించిందని విమర్శించారు. కనీసం అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా గత ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదన్న ఆయన అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. తాము సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

# లక్షలాది ఎకరాలకు సాగునీరు

## 'ప్రాణహిత-చేవెళ్ల' నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం

**తుమ్మడిహట్టి నుండి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తాం**
**ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నాం**
**ఆర్వీ అసోసియేట్స్, ఐ ఐ టి హైదరాబాద్ సమష్టిగా**
**నాలుగు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తెచ్చారు**
**ప్రతీ ప్రతిపాదనకు అయ్యే ఖర్చు, అనుకూల,**
**ప్రతి కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం**
**సీఎం తో సమీక్షలో నిర్ణయం తీసుకుంటాం**
**మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు**
**అవసరమైన పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలి**
**ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్.పి.టి టెస్ట్ లు నిర్వహించాలి**
**ప్రతీ మూడు మీటర్ల దూరంలో పెర్మియబిలిటీ టెస్ట్ లు జరపాలి**
**బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ**
**రాయి లోపలికి 5 మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలి**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి) :** ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. తుమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ మార్గాలతో పాటు మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణ పనులపై బుధవారం ఉదయం కుందన్ బాగ్ లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లికీ నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు

మిగతా 2లో

# పెండింగ్ బకాయిలకు మోక్షం

**రూ. వెయ్యి కోట్ల బకాయిలు విడుదల**
**నిధులు విడుదల చేసిన సందీప్ కుమార్ సుల్తానియా**
**నెలకు రూ.700 కోట్ల నుంచి రూ వెయ్యి కోట్లకు**
**పెరిగిన చెల్లింపులు • అక్టోబర్ 2025 వరకు**
**రిటైర్డ్ ఉద్యోగుల జిపిఎఫ్ క్లియర్**
**ఎప్పటికప్పుడు ఉద్యోగుల మెడికల్ బిల్లులు క్లియర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఎఎంఎస్) :** ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ. వెయ్యి కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ నిధుల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ. 700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న

మిగతా 2లో

## తాలు పేరిట తరుగు తీస్తున్నారు

**ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు?**
**ధాన్యం డబ్బులతో పాటే బోనస్ ఇవ్వాలి**
**పొద్దు తిరుగుడు రైతుల**
**కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా?**
**రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం**
**సీఎం రేవంత్ కు హరీశ్ రావు బహిరంగ లేఖ**



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి) :** తాలు పేరిట తరుగు తీస్తే తోలు తీస్తా అన్న సీఎం రేవంత్ రెడ్డి.. వడ్ల కొనుగోలు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు చెప్పారు.

మిగతా 2లో

## సీఎంతో జిఆర్ఎంబి చైర్మన్ భేటీ

**గోదావరి నది పరివాహక ప్రాజెక్టులు, జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జల వివాదాలపై చర్చ**



**తుది అంకానికి 'మెట్రో' మొదటి దశ స్వాధీనం**

2

**టెన్త్ ఫలితాలు విడుదల**

# అమ్మాయిల హవా

## పది ఫలితాల్లో మరోసారి బాలికలదే పై చెయ్యి

**• విద్యార్థుల పాస్ పర్సెంటేజీ 95.15 శాతం**
**• ప్రభుత్వ పాఠశాలల్లో 86.18 శాతం ఉత్తీర్ణత**
**• టాప్ లో ములుగు, చిట్ట చివరిలో హైదరాబాద్**



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి) :** టెన్త్ పరీక్షల రిజల్ట్ లో అమ్మాయిలు హవా చాటారు. తెలంగాణ పదో తరగతి పరీక్షల్లో బాలికలు ఆధిపత్యాన్ని కొనసాగించా రు. బాలుర కంటే ఎక్కువ శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 96 శాతానికి పైగా పాస్ కాగా.. బాలుర ఉత్తీర్ణత శాతం 94 శాతానికి పైగా ఉంది. 5731 స్కూళ్లలో అందరు విద్యార్థులు పాస్ కాగా.. ఆరు ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాకపోవడం గమనార్హం. అత్యధికంగా పాస్ పర్సెంటేజ్‌తో ములుగు జిల్లా టాప్‌లో ఉండగా.. అతి తక్కువ ఉత్తీర్ణత శాతంతో హైదరాబాద్ చిట్టచివరి స్థానంలో నిలిచింది.

2లో

## ప్రజల ముంగిటకే ప్రజా పాలన

**సమస్యల పరిష్కారమే లక్ష్యం**
**3 నెలల్లో దరఖాస్తుల కొలిక్కి కార్యాచరణ**
**పాలేరు ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి**



2

## దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ దే గెలుపు

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**



# భూముల విలువ పెంపు

**ప్రజలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా చర్యలు**
**దశలవారీగా పెంచాలని నిర్ణయం**
**పరిస్థితులను బట్టి రెండు, మూడు విడతల్లో పెంపు**
**ముందుగా 20 శాతం వరకు పెంచే అవకాశం**



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను పెంచే ప్రక్రియను ప్రజా ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. అయితే ప్రజలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండాలని ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ఇచ్చిన సూచనల మేరకు.. ఈ పెంపును దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ప్రకారం.. తొలి విడతలో సగటున 20 శాతం మేర విలువల పెంపును అమలు చేసే అవకాశం ఉంది. ఆ తర్వాత మార్కెట్ పరిస్థితులను బట్టి రెండు, మూడు విడతల్లో మిగిలిన పెంపును చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు పరిధిలో రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా శాస్త్రీయంగా భూముల మార్కెట్ విలువలను సవరించాలని సర్కార్ భావిస్తోంది. అరవింద్ సుబ్రహ్మణ్యం బృందం అధ్యయనం తెలంగాణలో భూముల మార్కెట్ విలువలపై లోతైన అధ్యయనం చేసేందుకు అరవింద్ సుబ్రహ్మణ్యం బృందం రంగంలోకి దిగింది.

మిగతా 2లో

# ఇరాన్ త్వరగా తెలివి తెచ్చుకోవాలి

**దౌత్యపరమైన పరిష్కారం త్వరలో**
**కుదరకపోతే, అమెరికా మరింత కఠిన వైఖరి : ట్రంప్**
**వాషింగ్టన్ ప్రతిపాదించిన షరతులను తెహ్రాన్ ప్రతిఘటిస్తూనే**
**ఉంటే, మరింత దూకుడు విధానాన్ని అవలంబించే అవకాశం**

**తెహ్రాన్‌ను హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్**

అణు సమస్యను నేరుగా పరిష్కరించనంత వరకు వాషింగ్టన్ చర్చలను ముందుకు తీసుకెళ్లదు. ఇరాన్ పతనం అంచున ఉన్నట్టు సూచించింది. తత్ఫలితంగా హోర్ముజ్ జలసంధిని వీలైనంత త్వరగా తిరిగి తెరవాలని ఒత్తిడి చేస్తోంది. తన సమీక్ష సందర్భంగా, తెహ్రాన్ అణు ఆకాంక్షలలో ఇమిడి ఉన్న ప్రపంచ భద్రతాపరమైన ప్రమాదాలను ట్రంప్ ప్రముఖంగా ప్రస్తావించారు. ఒకవేళ ఇరాన్ విజయవంతంగా అణ్వాయుధాలను పొందితే, ప్రపంచమంతా బందీగా మారుతుంది.




**వుదయం డెస్క్, ఏప్రిల్ 29 :** ఇరాన్ తమ వ్యవహారాలను సరిగ్గా చక్కదిద్దుకోలేకపోతోంది. అణ్వాయుధ రహిత ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో వారికి తెలియడం లేదు. వారు త్వరగా తెలివి తెచ్చుకోవడం మంచిది! అని ఇరాన్‌ను హెచ్చరిస్తూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమానికి సంబంధించి దౌత్యపరమైన పరిష్కారం త్వరలో కుదరకపోతే, అమెరికా మరింత కఠిన వైఖరిని అవలంబిస్తుందని ఆయన స్పష్టం చేశారు. తుపాకీని ధరించిన తన చిత్రాన్ని ట్రూత్ సోషల్‌పై పోస్ట్ చేస్తూ, ఇక మంచివాడిగా ఉండననే శీర్షికను ట్రంప్ దానికి ఇచ్చారు.

మిగతా 2లో



# గ్రేటర్ హైదరాబాద్



## చక్రం తిరిగేదెలా .. బతుకు సాగేదెలా..!?

### పెట్రోల్ డీజిల్ పరిస్థితులపై సయ్యద్ సాదిక్ సంచలన వ్యాఖ్యలు

**షాద్ నగర్, ఏప్రిల్ 29 (వుదయం):**



పెట్రోల్ డీజిల్ కొరతతో రవాణా రంగం కుదేలుగా మారిందని చక్రం తిరగక బతుకు బండి సాగడం లేదని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజుల వ్యవధిలో లీటర్ డీజిల్ దొరకడం గగన తరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక పరిణామాలతో ఇప్పటికే రవాణా రంగం కుదేలయిందని ఇప్పుడు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా పెట్రోల్ డీజిల్ కొరతతో లారీలు ముందుకు కదలని పరిస్థితి అని పేర్కొన్నారు. రవాణారంగంపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు క్లీనర్లు ఓనర్లు ఇంకా అనేకమంది సంబంధిత ప్రజలు పనులు లేక గాసం లేక లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ సరఫరాలో లోపాలు ఒక ఎత్తైతే షాద్ నగర్ నియోజకవర్గంలో కొన్ని ఆయిల్ కంపెనీ డీలర్లు తమకు ఇష్టం వచ్చిన కంపెనీలకు తమ ఖాతాదారులకు మాత్రమే డీజిల్ సరఫరా చేస్తున్నారని రాత్రి వేళల్లో దొంగచాటుగా డీజిల్ సరఫరా జరుగుతుందని సంచలన ఆరోపణలు చేశారు. బంకుల్లో ఖాతాలో ఉన్న ఆయా కంపెనీలకు సంబంధించిన వాహనాలకు రాత్రివేళలో డీజిల్ సరఫరా గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారని ప్రజలకు డీజిల్ విరివిగా అమ్మడం లేదని సయ్యద్ సాదిక్ ఆరోపించారు. అనేక బంకుల్లో ఈతతంగం నడుస్తుందని దీనిపై అధికారులు దృష్టిసారించాలని చర్యలు తీసుకోవాలని సాధిక్ డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని లేకపోతే రవాణా రంగం సంక్షోభంలో పడి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

## జాతర విజయవంతానికి పిలుపు

### అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**చేవెళ్ల,ఏప్రిల్29 (వుదయం) :**

మహనీయుల జాతరను విజయవంతం చేయాలని చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం పిలుపునిచ్చింది.ఈనెల 30న నిర్వహించనున్న జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మహనీయుల కమిటీ చైర్మన్ బురాన్ ప్రభాకర్ మాట్లాడుతూ...మహనీయులు సామాజిక న్యాయం, సమానత్వం, అంటరానితనం నిర్మూలన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలు అపారమని తెలిపారు. వారి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బసవేశ్వర మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల త్యాగాల బాటలో నడుస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించడం ద్వారానే సమ్మిళిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ మాచన్‌పల్లి రామస్వామి,కోశాధికారి ఏర్పుల మల్లేష్, యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్, సభ్యులు బ్యాగరి ప్రభాకర్, మల్లెపల్లి శ్రీనివాస్, సున్నపు మాణిక్యం, మద్దెల జంగయ్య, బ్యాగరి సత్తయ్య, బ్యాగరి రామకృష్ణ, గజ్జెల యాదయ్య, బ్యాగరి అశోక్, బ్యాగరి అజయ్, సున్నపు నర్సింలు, బురాన్ నరేష్, బురాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల విజయదుందుభి




**కరీంనగర్ ఏప్రిల్ 29 (వుద యం ప్రతినిధి):**

విద్యార్థులకు పటిష్టమైన ప్రణాళికలను రూపొందిస్తూ వారిని సంచలనాత్మక విజయాలను నమోదు చేసే విధంగా ప్రోత్సాహం అందిస్తూ వారి కలలను సహకారం చేస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక విలేకరుల సమావేశానికి మరియు అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ప్రకటించినటువంటి పదవ తరగతి ఫలితాలలో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం పై చెయి సాధించడమే కాకుండా అద్భుతమైన ఫలితాలను సాధించడం అల్ఫోర్స్ విద్యా విధానానికి ఒక గొప్ప ప్రతికని వారు గుర్తు చేశారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తూ తరగతి గదిలో బోధించినటువంటి విషయాలు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ అద్భుతమైనటువంటి ఫలితాలు వైపు పయనించాలని వారు సూచించారు. అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఆర్. సాత్విక్ 589 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడని, ఓ.ఆద్య, టి.రాజు, బి. అక్షిత్ రెడ్డి, 588 మార్కులు సాధించారని, 1274 మంది విద్యార్థులకు 1026 విద్యార్థులు 500 మార్కులు పైన సాధించడం చాలా స్ఫూర్తిదాయకమని చెప్పారు. 48 మంది విద్యార్థులు 580 మార్కులు పైగా సాధించారని మరియు 334 మంది విద్యార్థులు 560 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు అద్భుతమైన విజయాల సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. అనునిత్యం వారి పిల్లలకు ప్రోత్సాహం అందిస్తూ లక్ష్యాల వైపు పయనించే విధంగా ప్రోత్సహిస్తున్నటువంటి తల్లిదండ్రులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. వారి పిల్లలకు అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు మరియు అద్భుతమైనటువంటి ఫలితాలను సాధింపచేసినందుకు నరేందర్ రెడ్డిని తల్లిదండ్రులు ప్రశంసిస్తూ అభినందించారు మరియు ఘనంగా సత్కరించారు.






## షాద్ నగర్ అసెంబ్లీలో కొత్త పదవులు కోసం

# పైరవీలు షురూ

- కాంగ్రెస్ పార్టీ పదవుల రద్దు.. కొత్త పదవులకు కసరత్తులు..
- మండల అధ్యక్ష పదవులకు నెలకొన్న పోటీ..
- పదవుల హారం ఎవరిని వరించేనో..?
- షాద్ నగర్ నియోజకవర్గంలో దాదాపు ఎంపిక ప్రక్రియ పూర్తి..?

**షాద్ నగర్, ఏప్రిల్ 29 (వుదయం):**

అసెంబ్లీ ఎన్నికలతో మొదలుపెట్టి ఇప్పటిదాకా జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు మినహా అన్ని ఎన్నికలు పూర్తయ్యాయి. పార్టీ కోసం పని చేసిన వారు చాలామంది అవకాశాలు దక్కించుకుంటే, కొందరు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కొందరు ప్రాదేశిక ఎన్నికల వైపు ఎదురుచూస్తుండగా, మరికొందరు నామినేటెడ్ పదవుల కోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని చూస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో పాత పదవులన్నీ రద్దు అయ్యాయి. కొత్తగా వాటి స్థానంలో రథసారథులను నిర్మించేందుకు సమయం రానే వచ్చింది. ప్రస్తుతం పాత పదవులు రద్దుచేసి కొత్త పదవులకు నేతల ఎంపికకు సంబంధించి కసరతులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో షాద్ నగర్ అసెంబ్లీలో మండలాల వారీగా అధ్యక్ష స్థానాన్ని మొదలుకొని కీలక పోస్టుల్లో ఎవరెవరు ఉంటారు అనేదానిపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఒక్కసారి నియోజకవర్గ కాంగ్రెస్ పై కన్నేసినట్లయితే..

**ఎప్పటినుంచో ఎదురుచూపులు..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నామినేటెడ్, తదితర పార్టీ పదవుల కోసం ఎదురుచూస్తున్న నాయకులు చాలామంది ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో, సర్పంచ్ ఎన్నికల్లో, తాజా పురపాలక ఎన్నికల్లో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన చాలామంది నాయకులకు ఏదైనా నామినేటెడ్ పదవి లేదా పార్టీ పదవి అందుకోవాలనే ఆసక్తి ఉంది. ఈ నేపథ్యంలోనే పార్టీ పదవుల కోసం పోటీ కొనసాగుతోంది. నియోజకవర్గంలో ప్రస్తుతం ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడిగా చల్లా శ్రీకాంత్ రెడ్డి ఉండగా, ఈసారి బాలరాజు గౌడ్, ఇంకా అయిదారుల పేర్లు పోటీలో వినిపిస్తున్నాయి వీరితో పాటు మరికొందరు మండల పార్టీ అధ్యక్ష పదవికి పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కొందుర్గు మండలం నుంచి సీనియర్ నాయకుడు పురుషోత్తం రెడ్డి, మాజీ జడ్పిటిసి చిట్టెం దామోదర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లేష్, సయ్యద్ సాదిక్ లు పోటీలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఇక చౌదరి గుండా మండలంలో జాకారం సర్పంచ్ బీసీ నేత చంద్రశేఖర్, నందిగామ మండలంలో కుమార్ గౌడ్, కొత్తూరు మండలంలో యారం శేఖర్ రెడ్డి, అంబటి ప్రభాకర్ తదితరుల పేర్లు మండల అధ్యక్ష పదవుల బరిలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఇక మున్సిపాలిటీ విషయానికి వస్తే ఇక్కడ పట్టణ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొంకళ్ల చెన్నయ్య పనిచేస్తున్నారు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్ టికెట్ ఆశించి భంగపడిన ఆయన అప్పటినుంచి పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో పట్టణ అధ్యక్షుడు పదవిలో అతడినే కొనసాగిస్తారా, లేక కొత్తవారికి అవకాశం ఉంటుందా? అన్నది ప్రస్తుతం సస్పెన్స్ గా ఉంది. కపటన అధ్యక్ష పదవి కోసం యువజన కాంగ్రెస్ నాయకులు కాచుకుని కూర్చున్నట్లు తెలుస్తోంది. ఇక కిందిస్థాయి పదవులకు కూడా భారీ పోటీ నెలకొని ఉంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై



పదవుల విషయంలో క్రమంగా ఒత్తిడి పెరుగుతుంది. మరి ఆయన ఎవరికి పార్టీలో అవకాశం ఇస్తారు..ఎవరెవరికి నామినేటెడ్ పదవులు పొందుతారు.. అన్నది తేలాల్సి ఉంది.

**పనిచేసే వారికే ప్రాధాన్యం..**

పార్టీ కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యం ఇవ్వాలనే సంకల్పంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత పూర్తిగా క్షీణించిన దశలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అండగా ఉన్న నాయకులు ఉన్నారు. కరెక్ట్ గా ఎన్నికల ముందు పార్టీలో చేరి పార్టీకి బలం చేకూర్చిన నాయకులు ఉన్నారు. వీళ్లు కాకుండా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి చేరి కీలకంగా వ్యవహరిస్తున్న వాళ్ళు ఉన్నారు. అయితే మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తూ, కష్ట సమయాల్లో పార్టీకి, ఎమ్మెల్యేకు అండగా ఉన్న వ్యక్తులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ సీనియర్ నాయకుల నుంచి ఉంది. అదే విధంగా ఎన్నికల సమయంలో పార్టీకి అదనపు బలంగా మారి పార్టీ గెలుపుకు సహకరించిన నాయకులను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఆలోచన కూడా నాయకుల్లో లేకపోలేదు. ఎటు తిరిగి ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చాక పార్టీలో కొనసాగుతున్న వ్యక్తులకు పదవులు ఇవ్వకూడదు అనే డిమాండ్ కార్యకర్తల నుంచి వస్తుంది. పార్టీ సీనియర్ నాయకులు కూడా ఇదే అంటున్నారు. మరి పదవుల ఎంపికకు సంబంధించి పరిశీలకులు, ఎమ్మెల్యే ఎలా స్పందిస్తారో.. ఎవరెవరికి అవకాశం కల్పిస్తారో వేచి చూడాలి. అలాగే మహిళా విభాగంలో కూడా అనేకమంది ఆసక్తి చూపిస్తున్నారు ఎవరెవరికి పార్టీ పదవులు పోలిస్తాయో వేచి చూడాలి.

## క్రీడలతోనే యువతలో చైతన్యం

**పెద్దపల్లి,ఏప్రిల్ 2 (వుదయం ప్రతినిధి) :**

నియోజకవర్గ వ్యాప్తంగా గత 15 రోజులుగా బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ శ్రీమతి దాసరి ఉష ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహంగా సాగిన జ్యోతిబా పూలేఅంబేద్కర్ జై యుగం కప్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో విజయవంతంగా ముగిసింది.ఓదెల మండల పరిధిలోని కనగర్తి పాఠశాల మైదానంలో ఆర్గనైజర్లు కళ్యాణం మహేష్,మద్దికుంట సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన ఫైనల్ పోరులో కొలనూర్ సందీప్ టీం వర్సెస్ కొమ్మిరె అనిల్ టీం జట్లు తలపడగా,కొలనూర్ జట్టు విజేతగా నిలిచి షీల్డ్ మరియు రూ.10వేల నగదు బహుమతిని గెలుచుకుంది.రన్నరప్‌గా నిలిచిన కొమ్మిరె జట్టు షీల్డ్ తో పాటు రూ.5వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది.అలాగే సుల్తానాబాద్ టౌన్ పరిధిలో జరిగిన పోటీలలో 8వ వార్డు జట్టు విన్నర్‌గా,6వ వార్డు జట్టు రన్నర్‌గా నిలిచాయి.ఫైనల్ మ్యాచ్‌కు బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కనగర్తి సర్పంచ్ చొప్పరి సంధ్యారాణికుమార్,ఉప సర్పంచ్ మచ్చ సాయి రాణికొలనూరు సర్పంచ్ పల్లె కనకయ్య,బీఆర్ఎస్ గ్రామ వైస్ ప్రెసిడెంట్ పిట్టల సదయ్య,మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజయ్య,మాజీ సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మణ్, వార్డు మెంబర్లు కుమార్,అమర్ తో పాటు అసెంబ్లీ ఆర్గనైజర్ మాలిక్,సాతూరి అనిల్, బండా నిఖిల్,దొడ్డి అశోక్,పరికిపండ్ల రామ్,పెండెం కుమార్,గ్రామ యువకులు పాల్గొన్నారు.

## మహిళలు–చిన్నారుల భద్రతపై అవగాహన

**చేవెళ్ల, ఏప్రిల్ 29 (వుదయం) :**




ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమెన్ & చిల్డ్ సెఫ్టీ వింగ్ తెలంగాణ ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ సిబ్బందికి మహిళలు మరియు చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చేవెళ్ల డివిజన్ షీ టీమ్స్ ఇంచార్జ్ బి. శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో చేపట్టారు. సదస్సులో సామాజిక సంక్షేమం, బాలల హక్కులు, బాలల రక్షణ, “ప్రతి చిన్నారి రక్షణ మనందరి బాధ్యత” అనే అంశాలతో పాటు లింగ వివక్ష, స్త్రీ ద్వేషం వంటి కీలక విషయాలపై విస్తృతంగా చర్చించారు.అదేవిధంగా షీ టీమ్స్ సేవలు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా,మహిళలు-చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ...మహిళలు లేదా చిన్నారులపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112 నంబర్లకు, సైబర్ నేరాల కోసం 1930, బాలల సమస్యల కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సంప్రదించాలని సూచించారు. ఈవ్ టీజింగ్ ఘటనలు ఎదురైతే చేవెళ్ల షీ టీమ్ నంబర్ 8712663673కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఎల్పిజి కేవైసి అప్‌డేట్లు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్ల పేరుతో మోసగాళ్లు మభ్యపెడుతున్నారని హెచ్చరించారు. ఫేక్ వెబ్‌సైట్లు, ఓటీపీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటిపై జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో అపరిచితుల సందేశాలకు స్పందించకూడదని, వ్యక్తిగత ఫోటోలను అప్లోడ్ చేయడంలో జాగ్రత్తగా ఉండాలని మహిళలకు సూచించారు.తల్లిదండ్రులు పిల్లలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది, చేవెళ్ల షీ టీమ్ సభ్యులు మల్లేష్, జ్యోతి, వైద్యనాథం తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థుల ఘన విజయం

### ఎస్ఎస్సీ ఫలితాల్లో 97% ఉత్తీర్ణత -టాప్ మార్కులతో మెరిసిన విద్యార్థులు






**చేవెళ్ల, ఏప్రిల్29(వుదయం) :**

చేవెళ్ల మున్సిపాలిటీ లోని తెలంగాణ మోడల్ స్కూల్ (టి. జి.ఎం. ఎస్) విద్యార్థులు 2026 ఎస్ఎస్సీ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తమ ప్రతిష్టను చాటుకున్నారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో మొత్తం 97% ఉత్తీర్ణత శాతం నమోదవడం విశేషం. మొత్తం 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారిలో 97 మంది ఉత్తీర్ణత సాధించారు.ఇందులో 22 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాల గర్వాన్ని పెంచారు. ముఖ్యంగా పలువురు విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**టాప్ స్కోరర్లు ఇలా ఉన్నారు:**

కె. వైష్ణవి - 573 మార్కులు
బి. హర్షిత - 571 మార్కులు
వై. వైష్ణవి - 564 మార్కులు
ఎం. స్ఫూర్తి రెడ్డి - 562 మార్కులు
జి. అక్షిత - 558 మార్కులు
ఎం. రుచిత - 553 మార్కులు

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి కారణమని అభినందించారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి)**



ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వేగంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ’ సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 24 కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించారు. లారీ కంట్రాక్టర్ల సమస్య తలెత్తకుండా చూడాలని, ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా పాత బావుల పూడికతీత పనులు చేపట్టాలని, అవసరమైన చోట పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని సూచించారు. మండలంలో మంజూరైన 511 ఇందిరమ్మ ఇళ్లలో స్లాబ్ దశలో ఉన్న 265 ఇళ్లను జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని టార్గెట్ విధించారు. ఇప్పటికీ పనులు ప్రారంభించని 41 మందికి నోటీసులు ఇచ్చి, క్యాన్సల్ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. జూన్ మొదటి వారంలో నిర్వహించే 'బడి బాట' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను గణనీయంగా పెంచాలని అధికారులను కోరారు. 10వ తరగతి ఫలితాల్లో 97.8 శాతం ఉత్తీర్ణతతో జిల్లా అగ్రస్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. మండలంలో ఈ ఏడాది 1.25 లక్షల మొక్కలు నాటాలని, కొత్తగా నిర్మించిన రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో లూజ్ కేబుల్స్ సమస్యను పరిష్కరించాలని, రామవరం గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రైతులు, సర్పంచ్‌లకు అవగాహన కల్పించి ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భైరవ స్వామి గుడి, మహాసముద్రం గండి, అర్బన్ ఫారెస్ట్ పార్క్ ద్వారా ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రజా పాలన లక్ష్యం ప్రజల సంక్షేమం. అభివృద్ధి పనుల శంకుస్థాపనలు చేసి ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలి. ప్రతి గ్రామంలో సమస్యల పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం అని కొనియాడారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ హైమావతి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీఎఫ్ఓ పద్మజా రాణి, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రామ్మూర్తి, హౌసింగ్ పీడీ పవన్ కుమార్ మరియు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ విభాగంలో క్రమశిక్షణే ప్రధానం



**సిద్దిపేట, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి)**

పోలీస్ విభాగం అత్యంత క్రమశిక్షణతో కూడినదని, విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ వృత్తిపరమైన విలువలను పాటించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన "జెండర్ సెన్సిటైజేషన్" (లింగ వివక్షతపై అవగాహన) సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పని ప్రదేశాల్లో మహిళా సిబ్బంది పట్ల వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీపీ హెచ్చరించారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. తోటి సిబ్బందితో మాట్లాడేటప్పుడు మర్యాదగా, గౌరవంగా ఉండాలని సూచించారు.విధి నిర్వహణలో ఒకరిపై ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేయకూడదని, పోలీస్ ఫోర్స్ అంతా ఒకేకుటుంబంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో సానుభూతితో వ్యవహరించాలని, యూనిఫాం పట్ల విధేయతతో ఉంటూ బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, జూదం వంటి అనైతిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సీపీ గారు సిబ్బందితో నేరుగా మాట్లాడి, వారి వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే నిస్సంకోచంగా పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.మనం ధరించే యూనిఫాం మన బాధ్యతకు చిహ్నం. ప్రజలతోనే కాకుండా, తోటి సిబ్బందితో కూడా మర్యాదగా ప్రవర్తించినప్పుడే వ్యవస్థకు గౌరవం పెరుగుతుంది అన్నారు.సదస్సు ప్రారంభంలో షీ టీమ్స్ రూపొందించిన అవగాహన వీడియోలను ప్రదర్శించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ లింగ సమానత్వం గురించి మాట్లాడగా, న్యాయవాది రియాజుద్దీన్ మహిళా హక్కులు మరియు పని ప్రదేశాల్లో వేధింపుల నిరోధక చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (AR) సుభాష్‌చంద్రబోస్, ఏసీపీ రవీందర్ రెడ్డి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల రక్షణే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత

**గజ్వేల్, ఏప్రిల్ 29 (వుదయం ప్రతినిధి)**

మహిళలు మరియు పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాయని, వేధింపులకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని గజ్వేల్ షీ టీమ్ ఎస్సై శ్రీరాములు హెచ్చరించారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు, గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో బుధవారం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99’ కార్యక్రమంలో భాగంగా మహిళా రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపులను భరించవద్దని, సెక్సువల్ హెరాస్మెంట్‌కు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు లేదా ఉన్నతాధికారులకు




ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు. అత్యవసర సమయాల్లో మహిళలు 100 లేదా 112 నంబర్లకు డయల్ చేయాలని, ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు స్పందించి బాధ్యులపై కఠిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల రత్నం మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో మద్యం సేవించి వచ్చే గుర్తుతెలియని వ్యక్తుల వల్ల, దొంగతనాల వల్ల ఆసుపత్రిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అటువంటి సమయాల్లో పోలీసు గస్తీ పెంచాలని కోరారు.మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం శ్రమిస్తున్నాయి. ఏ చిన్న ఇబ్బంది కలిగినా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అధికారులు డాక్టర్ మంజుల (RMO), సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ విమల, హెడ్ నర్సులు వకులాదేవి, నిర్మల పాల్గొన్నారు. వీరితో పాటు ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ రజిత, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, పోలీస్ సిబ్బంది రామచంద్రారెడ్డి, మహేష్, శ్యామల, భాస్కర్ రెడ్డి మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



"నేను ఎగ్జిట్ పోల్స్‌ను పెద్దగా పట్టించుకోను, కానీ ఈసారి సామాన్యుడు బీజేపీకి ఓటు వేయలేదు. ఈ విషయం నాకు తెలుసు, ఎందుకంటే ఎన్నికలు సమస్యల ఆధారంగా జరుగు తాయి. బీజేపీ మాకు 10 సంవత్సరాల విజన్ డాక్యుమెంట్ ఇచ్చింది, కానీ దాని వాగ్దానాలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. అస్సాంలో మంచి రోజులకు బదులుగా చెడ్డ రోజులు వచ్చాయి. అస్సాంలో నిరుద్యోగం ఒక ప్రధాన సమస్య, 33 లక్షలకు పైగా యువత నిరుద్యోగులుగా ఉన్నారు. దాని గురించి ఏమీ చేయలేదు. దీని కారణంగా, మార్పు అవసరమైంది. అవేవీ జరగలేదు. గతంలో కంటే అవినీతి పెరిగింది, చేసిన వాగ్దానాలన్నీ నెరవేరలేదు. బీజేపీ పట్ల ఒక అంతర్లీన వ్యతిరేకత ఉంది, అందుకే చాలా మంది నిశ్శబ్ద ఓటర్లు ఉన్నారు. మొత్తం సుమారు 2.10 కోట్ల ఓటర్లలో, జాబితాలోని 70 లక్షలకు పైగా ఓటర్లు 29–30 ఏళ్ల వయస్సు గల యువకులు. కాబట్టి, మొత్తంగా చూస్తే, బీజేపీకి అనుకూలంగా ఎక్కువ ఓట్లు పడలేదని నేను భావిస్తున్నాను."

* – దేవవ్రత సైకియా, అస్సాం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత

## వేమన పద్యం

మాటలాడనేర్చి మనసు రంజిలజేసి
పరగ ప్రియములచెప్పి బదలకున్న
నొకరిచేత సొమ్ములూరక వచ్చునా
విశ్వదాభిరామ వినురవేమ.



## సంపాదకీయం

# ఓటరు మహాశయులకు అభినందనలు

ఏ మాత్రం విడుపు, రాజీ లేకుండా ఆకాశం నుంచి అదే పనిగా అగ్నివర్షం కురిపిస్తున్న ఎర్రటి ఎండల్లో ఎన్నికలు జరపడం ఆషామాషీ కాదు. భయంకరమైన వేసవిలో ఎన్నికల ఘట్టాన్ని జరిపించడం మనకు కొత్తకాదు, ఈ మధ్య అంటే 2000 సంవత్సరం నుంచి ఎన్నికలు తరచూ వేసవిలోనే జరుగుతున్నాయి. 2024 లోక్ సభ ఎన్నికల పోలింగ్ నూ ఇలాగే బండలు బద్దలయ్యే వేసవిలో జరుపుకున్నాము.వేసవి ఎన్నికలు దేశంలో సాధారణమైపోయాయని అంగీకరించక తప్పదు. 80 నుంచి 90 శాతం ఓటర్లు గంటలపాటు క్యూలల్లో నిలబడి ఓటు వేస్తున్నారంటే వారిని ఎలా అభినందించాలో తెలియడం లేదు.ఇది మన ప్రజాస్వామ్యానికి పండగ సందర్భం. అయితే వడగాలులు, మితిమించిన ఉష్ణోగ్రతల రీత్యా పోలింగ్ ను ఉదయం 11 గంటలకే ముగించడం మంచిదని భారత వాతావరణ శాఖ ఈ సారి ముందుగానే హెచ్చరించింది.ఇవ్వన్నీ వ్యర్థ హెచ్చరికలే అవుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం సైతం వీటిని పెడచెవిన పెడుతున్నది. విద్యార్థులకు పాఠాలు చెప్ప వలసిన అవసరం లేని వేసవి సెలవుల్లో ఎన్నికల విధుల నిర్వహణకు దండిగా ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది లభ్యం కావడం కూడా ఎన్నికలను ఈ కాలంలోనే నిర్వహించదలచుకోవడానికి ఒక ప్రధాన కారణం అయి ఉండవచ్చు.ఎన్నికల నిర్వహణ సిబ్బంది మారుమూల గ్రామాలకు వెళ్ళడానికి వాగులు వంకల అడంకి లేకుండా ఉండేది వేసవి కాలమే.2023 ఏప్రిల్ లో నేవీ ముంబై లో అమిత్ షా హాజరైన అతి పెద్ద బహిరంగ సభలో వడగాడ్పులకు 13 మంది మృతిచెందిన విషాద ఘట్టం తెలిసిందే. ఇప్పుడు నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అగ్ని గుండం లాంటి వేసవిలో ముగిసిన ఎన్నికల్లో ఆరు బయట క్యూలల్లో గంటల తరబడి నిలబడేటప్పుడు వేడికి, వడగాడ్పులకు ఓటర్లు మరణించకపోవడం వింతే. అలాగని ఎల్ల కాలం ఇలాగే ఉంటుందని అనుకోవడం భ్రమ. ఎన్నికల నిర్వహణకు శాశ్వత, తాత్కాలిక సొంత సిబ్బందిని ఎన్నికల సంఘం సమాకుర్చుకోవాలి అది ఏ కాలంలోనైనా పోలింగ్ జరిపించుకో డానికి ఉపయోగపడుతుంది.క్యూలల్లో ఓటర్లు స్పృహ తప్పిపోవడం ఓటింగ్ శాతం కూడా పడిపోతున్నదని ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా ఈ సారి జరిగిన ఎన్నికల్లో మన ఓటర్లు ఎన్నో ఇబ్బందులకు ఓర్చి భారీ శాతాల పోలింగ్ ను విజయవంతంగా జరిపించడం చరిత్రలో నిలిచిపోయే విషయం. ఇందుకు వారికి అభినందన వెల్లువలు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలి.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# రేపటి ప్రగతికి అంకురార్పణం

భారతదేశ పరిపాలనా ముఖచిత్రంలో జనగణన అనేది కేవలం అంకెల సమాహారం కాదు; అది ఒక దేశపు గతాన్ని విశ్లేషిస్తూ, వర్తమానాన్ని అంచనా వేస్తూ, భవిష్యత్తును నిర్మించే అత్యంత శక్తిమంతమైన శాస్త్రీయ ఆయుధం. ఒక దేశ ఆర్థిక పురోగతికి, సామాజిక న్యాయానికి, వనరుల సమతుల్య పంపిణీకి పునాదిగా నిలిచే ఈ ప్రక్రియ, మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిమళాన్ని అద్దుకుంటూ సరికొత్త రూపును సంతరించు కుంటోంది. 1872లో ప్రయోగాత్మక పునాదులతో మొదలై, 1881 నుండి నేటి వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్న ఈ దశాబ్దాల సంప్రదాయం, కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన అనూహ్య విరామం తర్వాత 2027లో సరికొత్త 'డిజిటల్' అధ్యాయాన్ని ప్రారంభించబోతోంది. ఈ నేపథ్యంలో, 2027 జనగణన అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక విప్లవాత్మక మలుపుగా, దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలవనుంది.

భారతదేశంలో జనగణన చరిత్రను అవలోకనం చేస్తే, బ్రిటీష్ పాలనా కాలంలో లార్డ్ మేయో హయాంలో 1872లో తొలి ప్రయత్నం జరగ్గా, డబ్ల్యూ.డబ్ల్యూ. హంటర్ నేతృత్వంలో 1881లో మొదటి సమగ్ర గణన నిర్వహించ బడింది. నాటి నుండి నేటి వరకు యుద్ధాలు, కరువులు సంభవించినా ఆగని ఈ ప్రక్రియ, 2021లో మాత్రం కరోనా సెకండ్ వేవ్ తీవ్రత కారణంగా వాయిదా పడక తప్పలేదు. దాదాపు 150 ఏళ్ల చరిత్రలో ఇలాంటి విరామం రావడం ఇదే తొలిసారి. అయితే, ఈ ఆలస్యం దేశ ప్రణాళికా రచనపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికీ 2011 గణాంకాలపైనే ఆధారపడి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ సుమారు 15 ఏళ్ల అంతరంలో దేశ జనాభా నిర్మాణం, పట్టణీకరణ వేగం, అక్షరాస్యత నమూనాలు సమూలంగా మారి పోయాయి. అందువల్ల, 2027లో జరగబోయే గణన ఆ పాత వివరాలకు, నేటి వాస్తవాలకు మధ్య ఉన్న భారీ అంతరాన్ని పూరించే వారధిగా మారుతుంది.

ఈసారి జరగనున్న గణనలో అత్యంత వినూత్నమైన మరియు ప్రతిష్టాత్మకమైన అంశం 'స్వీయ గణన' (Self-Enumeration). డిజిటల్ ఇండియా సఫలీకృత మవుతున్న తరుణంలో, పౌరులు తమ వివరాలను తామే నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించడం ఒక గొప్ప ప్రజాస్వామ్య సంస్కరణ. గతంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారు. దీనివల్ల భాషా సమస్యలు, సమాచార సేకరణలో పొరపాట్లు, సమయభావం వంటి ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ విప్లవం పుణ్యమా అని, ప్రభుత్వం కేటాయించిన https://se.census.gov.in పోర్టల్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల విద్య, వృత్తి, ఆదాయం, నివాస స్థితిగతులను పారదర్శకంగా నమోదు చేయవచ్చు. మే 10వ తేదీ లోపు ఈ స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేసి, పొందిన ప్రత్యేక ఐడీని భద్రపరుచు కోవడం ద్వారా, తర్వాత వచ్చే క్షేత్రస్థాయి సిబ్బందికి కేవలం ఆ సంఖ్యను చూపిస్తే సరిపోతుంది. ఇది దేశవ్యాప్తంగా లక్షలాది గంటల శ్రమను, కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఆదా చేయడమే కాకుండా, డేటా సేకరణలో ఖచ్చితత్వాన్ని గణనీయంగా పెంచుతుంది.



**గణాంక పరంగా చూస్తే, 2011లో భారత జనాభా 121.08 కోట్లుగా ఉండగా, ప్రస్తుత అంచనాల ప్రకారం అది 140 కోట్లు దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2011లో అక్షరాస్యత 74.04 శాతం ఉండగా, నేడు అది 80 శాతానికి పైగా చేరుకున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్త్రీ పురుష నిష్పత్తిలో వస్తున్న మార్పులు, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు జరుగుతున్న భారీ వలసలు, పెరుగుతున్న మధ్యతరగతి జనాభా వంటి అంశాలు 2027 గణన ద్వారా స్పష్టమవుతాయి. ఈ డేటా లేకపోవడం వల్ల నేడు రేషన్ కార్డుల కేటాయింపు, గృహ నిర్మాణ పథకాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాల్లో కొంత అనిశ్చితి నెలకొంది. 2027 గణాంకాలు వెలువడిన వెంటనే, 2029 తర్వాత జరగబోయే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు ఇది ప్రాతిపదికగా మారుతుంది, తద్వారా రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యత ఏర్పడుతుంది. సాంకేతికతతో కూడిన ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా అదే స్థాయిలో ఉన్నాయి.**

గణాంక పరంగా చూస్తే, 2011లో భారత జనాభా 121.08 కోట్లుగా ఉండగా, ప్రస్తుత అంచనాల ప్రకారం అది 140 కోట్లు దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2011లో అక్షరాస్యత 74.04 శాతం ఉండగా, నేడు అది 80 శాతానికి పైగా చేరుకున్నట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా స్త్రీ పురుష నిష్పత్తిలో వస్తున్న మార్పులు, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు జరుగుతున్న భారీ వలసలు, పెరుగుతున్న మధ్యతరగతి జనాభా వంటి అంశాలు 2027 గణన ద్వారా స్పష్టమవుతాయి. ఈ డేటా లేకపోవడం వల్ల నేడు రేషన్ కార్డుల కేటాయింపు, గృహ నిర్మాణ పథకాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాల్లో కొంత అనిశ్చితి నెలకొంది. 2027 గణాంకాలు వెలువడిన వెంటనే, 2029 తర్వాత జరగబోయే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు ఇది ప్రాతిపదికగా మారుతుంది, తద్వారా రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యత ఏర్పడుతుంది. సాంకేతికతతో కూడిన ఈ ప్రయాణంలో సవాళ్లు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. భారతదేశం లాంటి భిన్నత్వంతో కూడిన దేశంలో 'డిజిటల్ విభజన' ఒక ప్రధాన సమస్య. పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ వినియోగం అధికంగా ఉన్నప్పటికీ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో, వెనుకబడిన గ్రామాల్లో ఇంటర్నెట్ లభ్యత, సాంకేతిక అవగాహన తక్కువ. వృద్ధులు, చదువుకోని వారు స్వీయ గణనలో పాల్గొనడం కష్టతరం కావచ్చు. ఇక్కడే ఎన్యూమరేటర్ల పాత్ర కీలకం కానుంది. స్వీయ గణన అనేది సంప్రదాయ పద్ధతిని పూర్తిగా తొలగించదు, కానీ దానిని సులభతరం చేస్తుంది. ఎవరైతే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేరో, వారి వద్దకు సిబ్బంది నేరుగా వెళ్లి వివరాలు సేకరిస్తారు. అలాగే, సేకరించిన డేటా భద్రత మరియు గోప్యత విషయంలో ప్రజల్లో ఉన్న ఆందోళనలను ప్రభుత్వం పటిష్టమైన సైబర్ భద్రతా చర్యల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. మరోవైపు, వర్తమాన రాజకీయ సామాజిక కోణంలో 'కుల గణన' డిమాండ్ ఈసారి జనగణనకు మరింత ప్రాధాన్యతను తెచ్చిపెట్టింది. దేశంలోని ఓబీసీలు, ఇతర సామాజిక వర్గాల వాస్తవ సంఖ్యను తెలుసుకోవడం ద్వారానే 'జనాభా ప్రాతిపదికన వాటా' సాధ్యమని ఒక వర్గం వాదిస్తోంది. స్వతంత్ర భారత చరిత్రలో 1951 నుండి ఇప్పటి వరకు కేవలం ఎస్సీ, ఎస్టీల గణాంకాలను మాత్రమే సేకరిస్తున్నారు. ఈసారి కుల గణనను కూడా చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం దేశ సామాజిక గమనాన్ని మార్చివేస్తుంది. వనరుల పంపిణీలో అర్హులైన వారికి ప్రాధాన్యత దక్కాలంటే ఖచ్చితమైన కుల-ఆర్థిక గణాంకాలు అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు. జనగణన అనేది కేవలం ప్రభుత్వానికి సంబంధించిన విషయం కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత. మనం ఇచ్చే ప్రతి చిన్న సమాచారం ఒక పెద్ద జాతీయ విధానానికి రూపకల్పన చేస్తుంది. 2027 జనగణన ద్వారా లభించే డేటా, భారతదేశం 2047 నాటికి 'వికసిత్ భారత్'గా ఎదగాలన్న లక్ష్యానికి ఇంధనంగా పనిచేస్తుంది.

పౌరులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రక్రియ అత్యంత సరళంగా, పారదర్శకంగా ఉంది. ఈ 'స్వీయ గణన' విధానంలో పాల్గొన దలచిన వారు మొదటగా అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి తమ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ కనిపించే క్యాప్చా కోడ్‌ను నమోదు చేసిన తర్వాత, కుటుంబ పెద్ద పేరు మరియు క్రియాశీలకంగా ఉన్న చరవాణి సంఖ్యను అందించాలి. ఇక్కడ పౌరులు ఒక ప్రాథమిక జాగ్రత్త వహించాలి; కుటుంబ పెద్ద పేరు ఒకసారి నమోదు చేసిన తర్వాత మార్చడానికి వీలుండదు. ఈ ప్రాథమిక నమోదు విజయవంతమైన తర్వాత, రెండో విభాగంలో పౌరులు తమకు అనువైన భాషను ఎంచుకోవచ్చు. భాషను ఎంపిక చేసుకోగానే మొబైల్ నెంబర్‌కు ఒక ఓటీపీ అందుతుంది. దానిని నమోదు చేసిన అనంతరం జిల్లా, పిన్ కోడ్, గ్రామం లేదా పట్టణం వంటి భౌగోళిక వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. సాంకేతికతను మరింత సమర్థవంతంగా వాడుతూ, నివాస ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించేందుకు 'రెడ్ మార్కర్' సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా మ్యాప్‌లో మీ నివాసం ఎక్కడ ఉందో క్లిక్ చేసి నిర్ధారించుకోవచ్చు. మూడో విభాగంలో అసలైన గణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇక్కడ కుటుంబ సభ్యుల వివరాలు, వారి విద్య, వృత్తి, ఆదాయం మరియు నివాస స్థితిగతులకు సంబంధించిన సుమారు 33 కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. అన్ని వివరాలు నింపిన తర్వాత 'ప్రివ్యూ' ఆప్షన్ ద్వారా ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలి. తప్పులు ఉంటే సవరించుకుని 'ఫైనల్ సబ్మిట్' బటన్ నొక్కాలి. దీనితో మీ సమాచారం సర్వర్‌లో లాక్ అవుతుంది. అనంతరం మొబైల్ మరియు ఈ-మెయిల్‌కు 'H' అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల విశిష్ట ఎస్ఈ ఐడీ (SE ID) అందుతుంది. ఈ ప్రక్రియ అంతటితో ముగిసి పోదు. నాలుగో విభాగంలో ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో మీ ఇంటికి వచ్చినప్పుడు, మీరు ఆన్‌లైన్‌లో పొందిన ఎస్ఈ ఐడీని వారికి చూపించాలి. వారు తమ వద్ద ఉన్న డిజిటల్ పరికరాల్లో ఆ ఐడీని నమోదు చేయగానే మీరు ఇచ్చిన వివరాలు కనిపిస్తాయి. మీరు తెలిపిన సమాచారం, వారు ప్రత్యక్షంగా గమనించిన అంశాలు సరిపోలితే ప్రక్రియ ముగుస్తుంది. ఒకవేళ ఏవైనా పొరపాట్లు ఉన్నా లేదా డేటా మ్యాచ్ కాకపోయినా, వారు తిరిగి కొత్తగా వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఈ ద్విముఖ ధృవీకరణ పద్ధతి వల్ల సమాచారంలో తప్పులు దొర్లే అవకాశం ఉండదు. స్వీయ గణన ద్వారా పారదర్శకతను పెంచుతూ, సాంకేతికతను జోడిస్తూ నిర్వహిస్తున్న ఈ మహా క్రతువు, భారత పరిపాలనా వ్యవస్థలో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తుంది. సమాజంలోని ప్రతి వర్గం ఈ ప్రక్రియలో భాగస్వాములై, సరైన సమాచారాన్ని అందించినప్పుడే దేశాభివృద్ధి ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరుతాయి. వనరుల కేటాయింపులో హేతుబద్ధత రావాలన్నా, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నా ఈ గణాంకాలే ప్రాణాధారం. 2027 జనగణన కేవలం సంఖ్యల గణన కాదు, అది భారతదేశ భవిష్యత్ ప్రగతికి వేస్తున్న ఒక శాస్త్రీయ పునాది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, ఈ డిజిటల్ యజ్ఞంలో పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలి. అప్పుడే మనం కలలుగనే 'వికసిత్ భారత్' సాకారం అవుతుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రక్రియ, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పౌరుడిని నేరుగా భాగస్వామిని చేయడం ఒక గొప్ప ప్రజాస్వామ్య విజయం. ఈ చారిత్రాత్మక మార్పుకు సాక్ష్యంగా నిలవడమే కాకుండా, సకల సమాచారాన్ని సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో పయనించాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉంది.



సంగనబట్ల
9440595494

# ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రజాస్వామికమే!

ప్రజాస్వామ్య భారతదేశంలో బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైనది దేశంలో గ్రామ వార్డు సభ్యుడు నుండి మొదలు పెడితే 140 కోట్ల ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహించే ప్రధానమంత్రి వరకు ప్రజలు ఎన్నుకోవడానికి అవకాశం ఇచ్చిన బ్రహ్మాయుధమే ఓటు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలబడడానికి మూల కారణం ఓటు. ఓటుతోనే మార్పు ఓటుతోనే అభివృద్ధి అన్న మాట యదార్థ సత్యం. దేశంలోనే నకిలీ ఓట్లు అన్నింటిని తొలగించడం ముఖ్యంగా మరణించిన వారి ఓట్లను, తప్పుడు సర్టిఫికెట్లతో నమోదైన ఓట్లను, ఒకే పేరుతో ఉన్న 2,3 ఓట్లను, రెండు ప్రదేశాలలో ఒకే పేరుపై నమోదైన ఓట్లను గుర్తించి తొలగించడం, ప్రస్తుత ఓటరు జాబితాలో ఓటర్ల యొక్క పేరుగాని చిరునామా గాని ఇతరేమైనా తప్పులు ఉంటే సరి చేయడం....

**మరణించిన వ్యక్తికి కూడా ఓటు**

రాష్ట్రంలో ఒక వ్యక్తి మరణించి 2,3 సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఓటర్ లిస్టులో పేరు ఉంటుంది. వాటిని అదునుగా చేసుకొని ఎన్నికల సమయంలో దొంగ ఓట్లు కూడా వేస్తున్నారు. స్థానిక సంస్థల పంచాయితీ ఎన్నికల్లో ఈ ఓట్లు కూడా గెలుపోటములను నిర్ణయిస్తున్నాయి.

**నకిలీ సర్టిఫికెట్లతో ఓటు నమోదు**

కొందరు నకిలి సర్టిఫికెట్లతో దేశంలో ఓటు నమోదు చేసుకున్నారు. నకిలీ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డ్ లతో స్థానికేతరుడైన స్థానికుడి పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు ,నకిలీ మెమోలు సృష్టించి 18 సంవత్సరాలు నిండకపోయినా పుట్టిన తేదీ మార్చి మరి ఓటర్ జాబితాలో పేరు నమోదు చేయించుకున్న వారి సంఖ్య గణనీయమే.

**ఒకటే మనిషికి రెండు చోట్ల ఓటు**

ఒకే వ్యక్తికి ఒక రాష్ట్రంలో ఓటు హక్కు ఉండాలి కానీ కొందరు జీవనోపాధి కోసం వలస వెళ్లినవారు సొంత రాష్ట్రంలోనూ వలస రాష్ట్రంలోనూ ఓటు నమోదు చేసుకున్నారు. దీని కారణంగా ఎన్నికల సమయంలో కొన్ని నియోజకవర్గాలలో స్థానికేతర ఓటర్లే విజయాన్ని నిర్ణయించే స్థాయిలో ఉండటం కారణంగా స్థానిక సమస్యలను గానీ, స్థానిక అవసరాల పరిస్థితులకు



సంబంధం లేకుండా ప్రాంత అభివృద్ధిని పరిగణలోకి తీసుకోకుండా స్థానికేతర ఓటర్లు ఎన్నికల్లో ఎవరు ఎక్కువ డబ్బులు పంచితే వారికే ఓటెయ్యడం వల్ల స్థానిక ప్రజల సమస్యలు తీరడం లేదు.

**ఒకే వ్యక్తికి రెండు ఓట్లు**.. ఒక ఎలక్షన్ లో ఒక వ్యక్తికి ఒక ఓటు అన్నది నియమం కానీ ఒకే వ్యక్తికి ఒకే పేరుతో ఒక ఓటు ఇంకో పేరుతో ఇంకో ఓటును కూడా నమోదు చేయించుకున్నారు. మొదటి ఓటేమో సర్ నేమ్ తో చేసుకుంటే రెండవ ఓటేమో పేరుకు చివరన ఒక పదాన్ని జోడించి ఇంకో ఓటును నమోదు చేయించుకున్నారు.

**రాష్ట్రంలోనూ నకిలీ ఓట్లు**.. ప్రపంచంలోనే అతి తక్కువ ఖర్చుతో కుటుంబమంత హాయిగా జీవించగలిగే ప్రదేశం ఏదైనా ఉందంటే తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మహానగరం,ఒక మినీ ఇండియా గా పిలవబడే హైదరాబాద్ నగరంలో ఇతర రాష్ట్రాల నుండి ఇతర దేశాల నుండి సైతం ప్రజలు జీవనోపాధి కోసం ఉద్యోగాల కోసం ఇక్కడకు వచ్చి జీవనం సాగిస్తున్నారు. వీరిలో అందరూ అక్రమంగా వచ్చిన వారే అనలేము కానీ, మెజారిటీగా అక్రమంగా చొరబడి ఇక్కడ ఓట్లను నమోదు చేసుకున్నవారే. వారు ఈ దేశపు తిండి తింటూ ఈ దేశపు గాలి పీలుస్తూ పరాయి దేశం కోసం పరితపించే వారే తప్ప నిజాయితీగా దేశం కోసం పని చేసే నాయకులకు ఓట్లు వేస్తారా?అసలు వారికి ఈ దేశ ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుతో అందించే సంక్షేమ పథకాల లబ్ధి పొందే హక్కు ఉన్నదా? పాతబస్తీలో రోహింగ్యాలకు ఓటు హక్కు ఎందుకు కల్పించాలి? ఈ దేశ ఎన్నికలతో వారికి సంబంధం ఏమిటి? ఎవరి లబ్దికోసం వారి ఓట్లను నమోదు చేస్తున్నారు. ఎస్ ఐ ఆర్ రాష్ట్రాల్లో ఓటర్ జాబితా ప్రక్షాళన చేసిన తర్వాత ఉత్తరప్రదేశ్ లో 2.5 కోట్లు, వెస్ట్ బెంగాల్లో దాదాపు 90 లక్షలు, గుజరాత్ లో 68 లక్షలు, మధ్యప్రదేశ్ లో 34.25 లక్షలు రాజస్థాన్ లో 31 లక్షలు,చత్తీస్గఢ్ లో 25 లక్షలు ఇలా నకిలీ ఓట్లను గుర్తించడం జరిగింది.

ఓట్లు తొలగిస్తారన్న ప్రచారం కేవలం కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు తగ్గుతుందని ఈర్ష్యతో చేస్తున్న నిరాధారణ ఆరోపణలే. చట్టబద్ధమైన ఓట్లు తొలగిస్తారన్న కథనాలు కేవలం కల్పితమే. ఎక్కడ కూడా నిబంధనలకు లోబడి ఓటు నమోదు చేయించుకున్న వారి పేరును ఓటర్ లిస్టు నుండి తొలగించే ప్రసక్తే లేదు. ఒకవేళ అనుకోని కారణాలవల్ల తొలగించబడిన వెంటనే మీ పేరును ఓటర్ లిస్టులో నమోదు చేసుకునే అవకాశం భారత ఎన్నికల కమిషన్ కల్పించింది,

**ఓటర్ ప్రక్షాళన అత్యవసరం :** తెలంగాణ రాష్ట్రంలో కూడా ఓటర్ జాబితా ప్రక్షాళన తప్పకుండా జరగాల్సిందే బాంగ్లాదేశ్ పాకిస్తాన్ లాంటి దేశాలు లేదా ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా చొరబడి ఇక్కడ ఓటు హక్కు పొందిన వారి ఓట్లు తొలగించాల్సిందే, ఒకే వ్యక్తికి రెండు ప్రదేశంలో ఉన్న ఒక ఓటును, ఒకే వ్యక్తికి రెండు పేర్లతో ఉన్న ఓట్లను, మరణించిన వారి ఓట్లను జాబితా నుండి తొలగించి ఓటర్ లిస్టులో వ్యక్తుల పేర్లల్లో గాని చిరునామాలో గాని లేదా ఇతర సవరణలు ఏమైనా ఉంటే సవరించి ఓటు విలువను కాపాడుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టుకోవడానికి రాష్ట్ర ప్రజలందరూ కూడా సహకరించాలి.



హరీష్ సాగర్
6302758830

# ఆరోగ్య భారతంతో సుసంపన్న భారతం

"ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం"లో భాగంగా కేంద్ర ప్రభుత్వం "ఆయుష్మాన్ భారత్ పథకం" ప్రవేశపెట్టడంతో పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు సకాలంలో వైద్య ఆరోగ్య పరిరక్షణ చర్యలకు నడుం బిగించినట్లు అయ్యింది. ఏప్రిల్ 2018లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకం నేడు లక్షల భారతీయ అట్టడుగు వర్గాలకు ఆరోగ్యాన్ని అందుబాటు ఖర్చుతో అందించే వరంగా మారింది. ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారత్ తీసుకున్న ఏ చక్కని పేదల పక్షపాత పథకంగా గత ఏడు ఏళ్లుగా కొనసాగుతున్నది. కేంద్ర రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా "సమ్మిళిత వైద్య ఆరోగ్య సంరక్షణ" ధ్యేయంగా కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ పథకం అన్ని రాష్ట్రాలకు విస్తరించవలసిన అవసరం ఉందని తెలుసుకోవాలి. "అందరికీ అందుబాటులో వైద్య ఆరోగ్యం" అనే నినాదంతో ప్రారంభమైన ఆయుష్మాన్ భారత్ పథకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, అట్టడుగు వర్గాలకు ఈ పథకం ఆరోగ్య గొడుగు పట్టడం, ఆయుష్మాన్ కార్డులను కుటుంబాలకు అందజేయడం లాంటి లక్ష్యాలను అమలు చేయడానికి ప్రతి ఏట 30 ఏప్రిల్ రోజున "ఆయుష్మాన్ భారత్ దివస్/దినోత్సవం" పాటించడంతో పాటు రెండు వారాల పాటు "ఆయుష్మాన్ భారత్ పక్షోత్సవాలు/పక్వాడా" జరుపుకోవడం 2019 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 ఆయుష్మాన్ భారత్ దినోత్సవ ఇతివృత్తంగా "అందరికీ ప్రాథమిక ఆరోగ్య సురక్ష" అనే అంశాన్ని తీసుకుని ముందుకు సాగుతున్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి అందరినీ చేర్చడానికి విస్తృతమైన ప్రయత్నాలు లేదా ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అభాగ్యులను ఈ పథకంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటూ, ప్రజలకు పథకానికి మధ్య దూరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆరోగ్యం ఓ కనీస మానవ హక్కు అని, అది విలాసం (లగ్జరీ) కాదని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించడం, పేద కుటుంబాలకు ఆయుష్మాన్ కార్డులు జారీ చేయడం, వైద్య ఖర్చులను భారీగా తగ్గించడం, గ్రామీణ వైద్య సిబ్బందిని ప్రోత్సహించడం, పేదల నమ్మకాన్ని గెలుచుకోవడం, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించడం కొనసాగడం సంతోషదాయకం.

భారత అట్టడుగు వర్గాల్లో 55 కోట్ల లబ్ధిదారులను ఈ పథకం కిందకు తీసుకొచ్చి వారి వైద్య ఖర్చులను భారీగా తగ్గించడం జరుగుతోంది. దేశవ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలు, 40 కోట్ల ఆయుష్మాన్ కార్డులు అందజేసి 31,846 ఆసుపత్రుల ద్వారా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కీళ్ల మార్పిడి, బైపాస్ సర్జరీ లాంటి వైద్య చికిత్సలు కూడా ఈ పథకం కిందకు చేర్చబడ్డాయి. ఆయుష్మాన్ భారత్ దివస్‌లో భాగంగా గ్రామీణ స్థాయి వరకు వైద్య శిబిరాలు, ఆరోగ్య విద్య సెమినార్లు, పౌర సమాజానికి చేరువలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.



బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



# బెంగాల్‌లో ముగిసిన పోలింగ్

## సాయంత్రం 5 గంటలకు 90 శాతం ఓటింగ్ నమోదు



**కోల్‌కత, ఏప్రిల్ 29 (ఉదయం) :**

అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తుది దశ పోలింగ్ బుధవారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పోలింగ్ సమయం ముగిసేలోపే ఓటింగ్ శాతం 90 శాతానికి చేరుకుని, ఊహించని గణాంకాలను నమోదు చేసింది.

సాయంత్రం 5 గంటల సమయానికి, పూర్బ బర్ధమాన్ జిల్లా 92.46 శాతంతో భారీ ఓటింగ్ శాతాన్ని నమోదు చేసి అగ్రస్థానంలో కొనసాగింది. ఆ తర్వాతి స్థానాల్లో హుగ్లీ (90.34శాతం), నదియా (90.28శాతం), హౌరా (89.44శాతం), ఉత్తర 24 పరగణాల జిల్లా, దక్షిణ 24 పరగణాల జిల్లాలో వరుసగా 89.74శాతం, 89.57శాతంఓటింగ్ శాతం నమోదైంది.

294 మంది సభ్యులు కలిగిన శాసనసభకు పోలింగ్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, మే 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు ఇవి రంగం సిద్ధం అవుతోంది.

ఈసారి ప్రధాన పోటీ, వరుసగా నాలుగోసారి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తున్న అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రంలో చారిత్రాత్మక విజయాన్ని సాధించాలని ఆశిస్తున్న, పుంజుకుంటున్న బీజేపీకి మధ్య నెలకొంది.

రెండో దశ పోలింగ్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి, టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆర్‌జి కర్ వైద్య కళాశాల అత్యాచారం, హత్య బాధితురాలి తల్లి, బిజెపి అభ్యర్థి రత్న దేబ్‌నాథ్, టిఎంసి ఎంపీ మితాలి బాగ్, పశ్చిమ బెంగాల్ బిజెపి అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య తదితరులతో సహా పలువురు కీలక రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రెండవ దశ పోలింగ్‌లో భారీగా ఓటర్లు తరలిరావడంతో పాటు, హింసాత్మక ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రత్యర్థి పార్టీలపై ఒకరిపై ఒకరు దూషణలు, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించుకున్నాయి.

ఈ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లోని ఒక పోలింగ్ బూత్‌ను సందర్శించినప్పుడు, తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులు తనను చుట్టుముట్టి, దాడికి ప్రయత్నించారని పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు, భవానిపూర్, నందిగ్రామ్ బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఆరోపించారు. అనంతరం, టీఎంసీ మద్దతుదారుల బృందం జై బెంగాల్ నినాదాలు చేస్తూ ఆయనను చుట్టుముట్టారని ఆరోపణలు ఉన్నాయి.

పశ్చిమ బెంగాల్‌లోని పానిహటి అసెంబ్లీ నియోజకవర్గంలో, ఓటింగ్ సమయంలో తనను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్తలు లక్ష్యంగా చేసుకుని బెదిరించారని బీజేపీ అభ్యర్థి రత్న దేబ్‌నాథ్ కూడా ఆరోపించారు.

నదియా జిల్లాలోని హత్రా బజార్ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాల సమీపంలో, ఉదయం ఒక హింసాత్మక ఘర్షణ కూడా చెలరేగింది. హత్రా బజార్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్, ఐఎస్ఎఫ్ కార్యకర్తల మధ్య ఉద్రిక్తతలు చెలరేగినట్లు సమాచారం.

పశ్చిమ బెంగాల్‌లోని 294 స్థానాలకు గాను, రెండవ దశలో 142 స్థానాలకు పోలింగ్ జరిగింది. మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 3.21 కోట్లు. వీరిలో 1,64,35,627 మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. 41,001 పోలింగ్ కేంద్రాలలో 220 మంది మహిళలతో సహా 1,448 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీటిలో 8,000కు పైగా కేంద్రాలను పూర్తిగా మహిళలే నిర్వహిస్తున్నారు.

దక్షిణ బెంగాల్, కోల్‌కతాలోని పార్టీకి సంప్రదాయ కంచుకోటలైన ప్రాంతాలలో ఓటింగ్ జరుగుతున్నందున, ఈ చివరి దశ పోలింగ్‌ను టీఎంసీకి లిట్మస్ పరీక్షగా విస్తృతంగా పరిగణిస్తున్నారు. మొత్తం 142 స్థానాలు పోటీలో ఉన్నప్పటికీ, అందరి దృష్టి ఆ ఐదు ప్రధాన పట్టణ నియోజకవర్గాల పోరుపైనే కేంద్రీకృతమై ఉంది. అత్యంత కీలకమైన భవానిపూర్ స్థానంతో పాటు, బెంగాలీ చిత్ర పరిశ్రమకు గుండెకాయ వంటి టాలీగంజ్ నియోజకవర్గం కూడా, ప్రముఖులు, తారలతో నిండిన ఒక హైప్రొఫైల్ సమరంగా మారింది.

రెండవ దశ ఎన్నికలలో భవానిపూర్, టాలీగంజ్ నియోజకవర్గాలు ప్రధాన పోటీ కేంద్రాలుగా నిలిచాయి.

2021 ఎన్నికలలో, టిఎంసి ఈ నిర్దిష్ట ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని చాటుతూ, ఇక్కడి 142 స్థానాలలో 123 స్థానాలను కైవసం చేసుకుంది. బిజెపి విషయానికి వస్తే, పట్టణ ప్రాంత 'భద్రలోక్' ఓటర్లను, మతువా సముదాయాన్ని ఆకర్షించి, ఆయా వర్గాలలోకి చొచ్చుకుపోవడమే ఈ దశ ప్రధాన లక్ష్యం. ఇక టిఎంసి విషయానికి వస్తే, మమతా బెనర్జీ వరుసగా నాలుగోసారి అధికారాన్ని చేపట్టేందుకు, తమ పట్టును నిలబెట్టుకోవడమే అత్యంత కీలకం.

రాజకీయ పార్టీలు అధిక పోలింగ్ శాతాన్ని తమకు అనుకూలంగా వ్యాఖ్యానించుకుంటున్నాయి. మొదటి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 91.78 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటి దశలో పోలింగ్ జరిగిన 152 స్థానాల్లో కనీసం 100 స్థానాలను తామే గెలుచుకుంటామని తృణమూల్ కాంగ్రెస్ పేర్కొనగా, మొదటి దశలో 110 స్థానాలను గెలుచుకుంటామనే నమ్మకం తమకు ఉందని బీజేపీ తెలిపింది.

మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 23న జరిగింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాన పోటీ అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య నెలకొన్నట్లు కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు, అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలతో పాటు మే 4న ప్రకటించనున్నారు.

# 90ఏళ్ల మహిళ కేసు 2046కు వాయిదా

## మర్నాడే ఉత్తర్వులు రివర్స్

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 29 :** ఓ పరువు నష్టం కేసు విచారణలో భాగంగా బాంబే హైకోర్టు న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ఈ కేసులో 90ఏళ్ల వృద్ధురాలు మొండిపట్టుతో ఉండటంతో.. తదుపరి విచారణను 2046కు వాయిదా వేశారు. అయితే తర్వాత ఆ ఉత్తర్వులను మార్చారు. అసలు ఈ కేసు ఏంటంటే..?

2015లో ఈ కేసు మొదలైంది. అప్పుడు శ్యామ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో వార్షిక సమావేశం జరిగింది. అక్కడ జరిగిన కొన్ని ఘటనలతో మానసికంగా వేదన కలిగిందని ఆరోపిస్తూ.. 90 ఏళ్ల తరి



ణిబెన్, 57 ఏళ్ల ధ్వని దేశాయ్.. కొందరిపై 2017లో రూ.20కోట్ల పరువునష్టం దావా వేశారు. ఏప్రిల్ 20న జరిగిన విచారణ సందర్భంగా ఇరు పక్షాలు రాజీకి యత్నించాలని బాంబే హైకోర్టు సూచించింది. ప్రతివాదులు బేషరతుగా క్షమాపణ చెప్పడానికి అంగీకరించినప్పటికీ.. ఆ 90 ఏళ్ల వృద్ధురాలు పట్టువదల్లేదు. దాంతో కేసు మళ్లీ మొదటికి వచ్చింది. నీపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ జితేంద్ర జైన్ అసహనం వ్యక్తంచేశారు. "కొందరు వ్యక్తుల మధ్య జరుగుతోన్న పోరు ఇది. వ్యవస్థను జామ్ చేసే కేసుల్లో ఇది ఒకటి. ఇలాంటి కేసుల వల్ల అత్యంత ప్రాధాన్యత ఉన్న కేసుల్ని న్యాయస్థానం చేపట్టలేకపోతోంది. ఈ కేసు వేసింది సూపర్ సీనియర్ సిటిజన్ అయినంత మాత్రాన ప్రాధాన్యం ఇవ్వలేం. 2046 తర్వాతే ఈ కేసు విచారణ చేపట్టాలి" అని ఆదేశించారు. అయితే బుధవారం ఆదేశాలను రివర్స్ చేశారు. జులై 15, 2026కి తదుపరి విచారణను వాయిదా వేస్తూ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు.

# సింఘభమ్‌లో ఎదురు కాల్పులు

**రాంచీ, ఏప్రిల్ 29 (ఉదయం) :**



పశ్చిమ సింఘభమ్‌లోని టోంటో పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం మావోయిస్టులకు, భద్రతాదళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. రుతుగుతు దట్టమైన అడవుల్లో కొనసాగుతున్న ముమ్మర గాలింపు చర్యలలో భాగంగా, కోబ్రా 209 బెటాలియన్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, అందిన ఒక ముందస్తు సమాచారం ఆధారంగా, కోబ్రా 209 దళానికి చెందిన సిబ్బంది ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు సమయంలో, అడవి లోపలి భాగంలో అనుమానాస్పద కదలికలు కనిపించడంతో, ఇరు వర్గాల మధ్య స్వల్ప కాల్పుల మార్పిడి జరిగింది.

గాలింపు చర్యల సమయంలో అడవిలో అనుమానాస్పద కదలికలు కనిపించాయి. దీనితో ఇరు వర్గాల మధ్య స్వల్ప కాల్పుల మార్పిడి జరిగింది. అయితే, ఇప్పటివరకు ఎటువంటి భారీ ఎదురు కాల్పులు జరిగినట్లు గానీ, ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించినట్లు గానీ అధికారిక నిర్ధారణ ఏదీ లేదు. భద్రతా దళాలు వెంటనే వ్యూహాత్మక స్థానాలను ఆక్రమించి, ఆ ప్రాంతంపై తమ పట్టును మరింత బిగించాయి. పొంచి ఉన్న ముప్పులను దృష్టిలో ఉంచుకుని, వారు తమ భవిష్యత్తు వ్యూహాన్ని రూపొందించడం ప్రారంభించారు.

ఎదురు కాల్పులలో పాల్గొన్న దళంలో, తన తలపై రూ. 1 కోటి నజరానా కలిగిన మావోయిస్టు కమాండర్ మిసిర్ బెస్రా కూడా ఉండవచ్చని బలంగా విశ్వసిస్తున్నారు.

కాగా, భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించాయి. అదనపు సిబ్బందిని అప్రమత్తం చేశాయి. గాలింపును ముమ్మరం చేస్తూ, చుట్టుపక్కల అడవులంతటా ప్రస్తుతం సమగ్ర గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కాల్పులు కొనసాగుతుండటంతో, ఆ ప్రాంతమంతటా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ముఖ్యంగా, దట్టమైన అడవులు, చుట్టూ కఠినమైన కొండలు కలిగిన బోరోయ్ ప్రాంతం, కార్యకలాపాలు నిర్వహించే భద్రతా దళాలకు గణనీయమైన సవాళ్లను విసురుతోంది.

ఈ ఘటనను ధృవీకరిస్తూ, భద్రతా దళాల ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని పోలీస్ సూపరింటెండెంట్ అమిత్ రేణు తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతటా విస్తృత గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు.

దళాలు అత్యంత అప్రమత్తతతో ముందుకు సాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు, ప్రతి అనుమానాస్పద కదలికపై నిశిత నిఘా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

గోయిల్‌కేరా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఒక మాజీ మావోయిస్టు హత్యకు గురైన నేపథ్యంలో, ఆ ప్రాంతంలో తిరుగుబాటు కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు అప్పుడే వ్యక్తమయ్యాయని సమాచారం.

మావోయిస్టు కమాండర్ మిసిర్ బెస్రా నాయకత్వంలో, ఆ సంస్థ ఈ ప్రాంతంలో ఇప్పటికీ చురుకుగా కొనసాగుతూ, తన పట్టును మరింత బలపరుచుకోవడానికి ప్రయత్నిస్తోంది. సారండా, కోల్హాన్ ప్రాంతాలలో మావోయిస్టులు తిరిగి సమీకృతం కావడానికి ప్రయత్నిస్తున్నారని భద్రతా సంస్థలకు నిఘా సమాచారం అందింది. ఇటీవలి ఎన్‌కౌంటర్ ఈ ఆందోళనలను మరింత బలపరిచింది. ఫలితంగా, ఆ ప్రాంతమంతటా హై అలర్ట్ ప్రకటించి, ప్రతి అనుమానాస్పద కదలికపై నిశితంగా గమనిస్తున్నారు.

ముఖ్యంగా, పశ్చిమ సంఘభమ్‌లోని సరందా, కోల్హాన్ అడవులలో ఇప్పటికీ ఉన్న కొద్దిమంది మావోయిస్టులు భద్రతా దళాల కంట పడకుండా ఉండేందుకు ఇప్పుడు సంచార శిబిరాలకు తరలివెళ్లారు. పోలీసులు బంకర్ల వద్దకు చేరుకోకుండా నిరోధించడానికి, వాటి చుట్టూ స్పైక్ హోల్స్, ఐఈడీలతో కూడిన పటిష్టమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతమంతటా మావోయిస్టులు ఐఇడిలను అమర్చినప్పటికీ, భద్రతా దళాలు పూర్తి దృఢ సంకల్పంతో అడవుల్లోకి నెమ్మదిగా ముందుకు సాగుతూ, వారి కీలక ప్రాంతాల్లో అనేక తాత్కాలిక భద్రతా శిబిరాలను ఏర్పాటు చేశాయి.

# ఎన్నికల పరిశీలకుడిగా అజయ్ పాల్ పాత్రను సవాలు చేస్తూ సుప్రీంలో పిల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఉదయం):**

పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో ఉత్తర ప్రదేశ్ కేడర్‌కు చెందిన ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారి అజయ్ పాల్ శర్మను ఎన్నికల పరిశీలకునిగా నియమించడాన్ని సవాలు చేస్తూ భారత సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) దాఖలైంది. అతడు టిఎంసి అభ్యర్థిని బెదిరించి, పక్షపాత వైఖరిని ప్రదర్శించడం ద్వారా సమాన అవకాశాలను దెబ్బతీశారని అందులో ఆరోపించారు.

పశ్చిమ బెంగాల్ ఓటరైన ఆదిత్య దాస్ మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌లో, రాష్ట్రంలో బుధవారం రెండవ దశ పోలింగ్ ముగిసినప్పటికీ, దక్షిణ 24 పరగణాలలో 'పోల్ అబ్జర్వర్'గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శర్మ, ఫల్తా నియోజకవర్గం ఏఐటీసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌ను, అతని కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని, శర్మ స్థానంలో మరొకరిని నియమించాలని తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన శర్మ, ఖాన్‌ను, ఆయన కుటుంబాన్ని బెదిరిస్తున్నట్లుగా ఉన్న ఒక వీడియో సోమవారం నాడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ బెదిరింపుపై స్పందిస్తూ, ఖాన్ తెలుగు యాక్షన్ చిత్రం 'పుష్ప', బాలీవుడ్ చిత్రం 'సింగం'లను ప్రస్తావించారు.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో పనిచేస్తూ, 'యూపీ సింగం'గా ప్రసిద్ధి చెందిన 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్' అయిన



ఆయనను పరిశీలకుడిగా నియమించడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని పిల్ ప్రశ్నించింది.

"ఎటువంటి ఫిర్యాదు లేదా ఎఫ్ఐఆర్ లేనప్పుడు——ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో,ఒక అభ్యర్థి నివాసానికి వెళ్లడానికి, అలాగే ఆ అభ్యర్థిని గానీ లేదా వారి కుటుంబ సభ్యులను గానీ బహిరంగంగా భయపెట్టడానికి లేదా బెదిరించడానికి చట్టంలోని ఏ నిబంధన కూడా ఒక పోలీసు పరిశీలకుడికి అధికారం ఇవ్వదు," అని ఆ పిటిషన్ పేర్కొంది.

పార్టీ వర్గాల ప్రకారం, ఈ కేసును అత్యవసరంగా విచారణకు జాబితా చేయాలని ఆదేశం పొందడానికి పిటిషనర్ తరఫు న్యాయవాదులు పలుమార్లు ప్రయత్నించారు. కేసులను అత్యవసరంగా జాబితా చేయాలనే అభ్యర్థనలను చూసే సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌ను కూడా సంప్రదించినప్పటికీ, భారత ప్రధాన న్యాయమూర్తి నుండి కేసును జాబితా చేయాలన్న ఆదేశం రాలేదు.

దాస్ మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నందున ఆ పిటిషన్‌ను స్వీకరించడానికి హైకోర్టు నిరాకరించింది. ఏప్రిల్ 23న మొదటి దశ పోలింగ్ ముగిసిన వెంటనే, ఏప్రిల్ 25న శర్మ బాధ్యతలు స్వీకరించారు. 4వ ప్రతివాది నియామకం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జరగలేదు; స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణను నిర్ధారించేందుకు భారత ఎన్నికల సంఘం తీసుకున్న చర్యగా ఇది ఖచ్చితంగా పరిగణించలేం," అని ఆ పిటిషన్ పేర్కొంది. పరిశీలకుడిని ఒక తటస్థ సంస్థాగత రక్షణ కవచంగా పరిగణిస్తారు; ఎన్నికల నిష్పక్షపాతతపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలపరచడమే ఆయన ఉనికి ఉద్దేశ్యం. అయితే, ప్రస్తుత కేసులో, ప్రతివాది సంఖ్య 4 (శర్మ) ప్రవర్తన, ఒక పరిశీలకుడి విధులకు పూర్తిగా విరుద్ధంగా ఉంది, అని న్యాయవాది సంచిత్ గార్గా ద్వారా దాఖలు చేసిన పిటిషన్ పేర్కొంది.

శర్మను నియమించడంలో ఈసీఐ తీసుకున్న చర్యలు, ఆ తర్వాత ఆయన ప్రవర్తన స్పష్టంగా ఏకపక్షమైనవి, దురుద్దేశపూరితమైనవి, వివక్షాపూరితమైనవి అని, దీని ఫలితంగా "ఎన్నికల ప్రక్రియలో సమాన అవకాశాలకు భంగం కలుగుతోంది" అని దాస్ అన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేటాయించిన పాత్రకు పరిశీలకుడి ప్రవర్తన పూర్తిగా విరుద్ధంగా ఉందని, ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడానికి బదులుగా, ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేస్తూ, చట్టబద్ధమైన పాలనను బలహీనపరుస్తున్నారని పేర్కొంది.

## ఈవీఎం ట్యాంపరింగ్ వివాదం

# ఫిర్యాదులు ధృవీకృతమైతేనే రీపోలింగ్



**కోల్‌కత, ఏప్రిల్ 29 (ఉదయం) :**

బుధవారం పశ్చిమబెంగాల్‌లో జరుగుతున్న రెండోవిడత పోలింగ్‌లో ఈవిఎంల ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలు తలెత్తాయి. కాగా, ఇటువంటి బూత్‌లలో రీపోలింగ్ ప్రకటించవచ్చని పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) మనోజ్ అగర్వాల్ పేర్కొన్నారు. అయితే, జిల్లా అధికారి లేదా ఎన్నికల పరిశీలకుల నుంచి నివేదికలు అందిన తర్వాతే తిరిగి పోలింగ్ ఆదేశిస్తామని ఆయన స్పష్టం చేశారు.

డైమండ్ హార్బర్‌లోని ఫల్తా నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లతో 'కమలం గుర్తు' కనిపించకుండా చేసి, ఓటేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని బిజెపి ఆరోపించింది. ఓటింగ్ యంత్రంలో కమలం గుర్తు దగ్గర ఉన్న బటన్‌ను వినియోగించకుండా దానిని టేప్‌తో కప్పి ఉంచినట్లు బిజెపి పశ్చిమబెంగాల్ కోఇన్‌ఛార్జి అమిత్ మాలవ్యా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పలు వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో పాటుగా ఇక్కడ రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకుడు పంచుకున్న వీడియో ప్రామాణికతను కమిషన్ ఇంకా ధృవీకరించలేదు, అయితే క్షేత్రస్థాయి నుంచి అందిన నివేదికలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఈవీఎంలపై నలుపు లేదా తెలుపు రంగు టేపులు అతికించడం గురించిన ఫిర్యాదులను మేం సమీక్షిస్తాం, ఆ తర్వాత తిరిగి పోలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందో లేదో పరిశీలిస్తాం," అని అగర్వాల్ విలేకరులతో అన్నారు. ఈ సమస్య విస్తృతంగా ఉన్నట్లు తేలితే, కమిషన్ తన కార్యాచరణ పరిధిని విస్తరించవచ్చని ఆయన సూచించారు.

ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బూత్‌లలో టేపులు అంటించినట్లు నివేదికలు వస్తే, ఆ నియోజకవర్గం మొత్తం మీద తిరిగి పోలింగ్ నిర్వహించవచ్చు, అని ఆ అధికారి తెలిపారు. ఇదిలా ఉండగా, ఈసీకి మొత్తం 2,196 ఫిర్యాదులు అందాయి.

# మమత ముఖంలో ఆందోళన

## కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి

**కోల్‌కత, ఏప్రిల్ 29 (ఉదయం) :**

పశ్చిమ బెంగాల్ రెండవ, ఆఖరు విడత ఎన్నికలు బుధవారం జోరుగా సాగాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పోలింగ్ బూతుల ఎదుట క్యూలు కట్టి, ఓటు వేస్తున్నారు. ఈ క్రమంలోనే పలు వివిధ పార్టీల మధ్య, నాయకుల మధ్య వివిధ ఆరోపణలు, విమర్శలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా, కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఎన్నిక రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తన నియోజకవర్గంలోనే ఒక బూత్ నుంచి మరొక బూత్‌కు పరుగెత్తడాన్ని చూడటం ఇదే మొదటిసారని, గతంలో ఇటువంటి ప్రవర్తనను చూడలేదని అన్నారు. ఆమె కళ్లల్లో, ముఖంలో స్పష్టమైన ఆందోళన కనిపిస్తోంది, మరో మాటలో చెప్పాలంటే ఈసారి తాను గెలుస్తాననే నమ్మకం ఆమెకు అస్సలు లేదంటూ వ్యాఖ్యానించారు.

స్వంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో కూడా ముఖ్యమంత్రి స్వయంగా పరిస్థితిని సమీక్షించడానికి రావడం చూస్తే, ఆమె రాజకీయ పరిస్థితి అర్థమవుతుందని ఆయన అన్నారు.



ఈసారి బెంగాల్ ఎన్నికల్లో భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సీటు నుంచే బీజేపీ కీలక నేత సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. మమతా బెనర్జీని 2021 ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి సువేందు ఓడించారు. ఈసారి భవానీపూర్ నుంచి కూడా ఓడించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో భవానీపూర్ లోని ప్రతీ బూత్‌ను మమతా బెనర్జీ సందర్శించి, పర్యవేక్షించారు.

బెంగాల్ బర్హంపూర్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి, ఎన్నికల సంఘం ఏర్పాట్లను ప్రశంసించారు. తొలిసారిగా బెంగాల్‌లో ప్రజలు ఎలాంటి భయం లేకుండా ఓట్లు వేస్తున్నారని అన్నారు. బెంగాల్‌లో హింసా సంస్కృతి టీఎంసీ వ్యూహంలో భాగమని ఆయన ఆరోపించారు. ఇక్కడ భారీ స్థాయిలో కేంద్ర బలగాలు మోహరించడంతో ప్రజలు నిర్భయంగా ఓటేస్తున్నారని అన్నారు.

మొత్తం 294 నియోజకవర్గాలకు గాను, తొలి విడతలో 152 స్థానాలకు పోలింగ్ ముగియగా, మిగిలిన 142 స్థానాలకు బుధవారం పోలింగ్ జరిగింది.






# టివికె అధినేత విజయ్ తీర్థయాత్రలు

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 29 :**

రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో నటుడురాజకీయ నాయకుడు, తమిళగ వెట్రి కజగంస (టివికె) వ్యవస్థాపకుడు జోసెఫ్ విజయ్ తన ఆధ్యాత్మిక పర్యటన ప్రారంభించారు. మొదటగా తిరుచెందూర్ ఆలయాన్ని సందర్శించిన ఆయన మరుసటి రోజే, బుధవారం నాడు షిర్డీకి బయలుదేరారు.



విజయ్ చెన్నైలోని తన నీలాంకరై నివాసం నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రైవేటు విమానంలో షిర్డీకి బయలుదేరిన ఆయన సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆయన గురువారం ఉదయం నాటికి చెన్నైలో ఉంటారని భావిస్తున్నారు.

మంగళవారం నాడు తిరుచెందూర్ మురుగన్ ఆలయాన్ని సందర్శించి, అక్కడ తెల్లవారుజామున జరిగే విశ్వరూప దర్శనం'లో పాల్గొన్న తర్వాత ఆయన షిర్డీ పర్యటనకు బయలుదేరారు.

ఆలయ సందర్శన సందర్భంగా భారీ సంఖ్యలో జనం పోటెత్తడంతో, ఇది ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ఆ ప్రముఖుడిని ఒక్కసారి చూడాలనే ఆసక్తితో అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడ గుమిగూడారు.

ఏప్రిల్ 23న, తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకే దశలో పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రక్రియ ముగిసి, మే 4న జరగనున్న ఓట్ల లెక్కింపుకు ముందు, పలువురు రాజకీయ నాయకులు తమ బహిరంగ కార్యక్రమాల నుండి తాత్కాలికంగా విరామం తీసుకున్నారు.

రాజకీయ నాయకుడిగా తన తొలి ప్రధాన ఎన్నికల పరీక్షను ఎదుర్కొన్న అనంతరం, విజయ్ ఆలయ సందర్శనలు ఒక విస్తృత వ్యక్తిగత, ప్రతీకాత్మక ప్రచారంలో భాగంగా పరిగణిస్తున్నారు.

మతం, ప్రజా జీవితం విడదీయరాని విధంగా ముడిపడి ఉన్న తమిళనాడు సామాజికరాజకీయ వాతావరణంలో, ఇటువంటి ఆధ్యాత్మిక పర్యటనల వెనుక తరచుగా రాజకీయ అంతరార్థాలు ఉంటాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# బెంగాల్‌లో సమాంతర పాలనను సృష్టించారు

**లక్నో, ఏప్రిల్ 29 (ఉదయం):**

ఎన్నికలను ప్రభావితం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లో కేంద్ర భద్రతా దళాల నేతృత్వంలో సమాంతర పాలనా వ్యవస్థను సృష్టించారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ బుధవారం ఆరోపించారు. అధికార దుర్వినియోగాన్ని వ్యతిరేకించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. బెంగాల్‌లో 'దీదీ' చారిత్రాత్మకమైన ఓట్లతో విజయం సాధించబోతున్నారు. బెంగాల్ ప్రజలు భారీ సంఖ్యలో ఆమెకు అనుకూలంగా ఓటు వేస్తున్నారు, అని ఆయన ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుత పరిపాలనా యంత్రాంగంతో పాటు, మొట్టమొదటిసారిగా ఒక సమాంతర వ్యవస్థను సృష్టించారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర బలగాల ద్వారా ఒక సమాంతర నిర్మాణం ఏర్పాటు కావడాన్ని మనం ఇప్పుడు చూస్తున్నాం. పైస్థాయి నుండి కిందిస్థాయి వరకు, పూర్తిగా వేరొక అధికార శ్రేణిని నెలకొల్పారు అని ఆయన నొక్కి చెప్పారు.

పోలీసు డైరెక్టర్ జనరల్ (డిజిపి) స్థాయిలోనే జోక్యం జరుగుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని అఖిలేష్ ఆరోపించారు. డిజిపిగా ఎవరు ఉండాలనే దానిపై పేర్లు సూచిస్తున్నారు. అంతే కాకుండా, ప్రతి జిల్లాలోనూ జిల్లా పోలీసు అధిపతిని కాదని, ఒక ఐపిఎస్ అధికారిని ఆయన కంటే ముందు వరుసలో ఉంచారు, అని ఆయన పేర్కొన్నారు. కొంతమంది అధికారులు ఒత్తిడికి లేదా ప్రలోభాలకు లొంగి పనిచేస్తున్నారని యాదవ్ ఆరోపించారు.

పశ్చిమ బెంగాల్‌లో పోస్టింగ్ పొందిన అధికారులలో కొందరికి ఇప్పటికే ప్రయోజనాలు కల్పించారు, లేదా భవిష్యత్తులో లాభాలు వస్తాయని హామీ ఇచ్చారు. విచారణలు లేదా ఇతర కారణాల వల్ల వారిపై ఒత్తిడి ఉండటంతో కొందరిని పంపారు, అని ఆయన ఆరోపించారు.

ఉత్తరప్రదేశ్‌తో పోలుస్తూ, రాంపూర్ లోక్‌సభ ఉప ఎన్నికలో కూడా ఇటువంటి ఎత్తుగడలే ప్రయోగించారని ఆయన ఆరోపించారు. రాంపూర్‌లో ఏ తరహా నమూనా అయితే కనిపించిందో, ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇప్పుడు బెంగాల్‌లోనూ అదే నమూనాను పునరావృతం చేస్తున్నారు, అని ఆయన అన్నారు. ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిస్తూ, అధికారులను దుర్వినియోగం చేసే వారికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలను కోరారు. అన్యాయాలకు పాల్పడేందుకు అధికారులను వాడుకుంటున్న వారిని, ఓట్ల ద్వారా ఓడించాలి, అని అఖిలేష్ పేర్కొన్నారు.

# కరీంనగర్ | ఆదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి(కమాన్ పూర్) (వుదయం ప్రతినిధి)**
జిల్లాలో నాణ్యమైన ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కమాన్‌పూర్ మండలంలోని గుండారం ఐకెపి సెంటర్‌ను, ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ధాన్యం సేకరణలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ ఎక్కువ మంది హమాలీ కార్మికులను సమకూర్చి వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా రైతులకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకేట్లు, త్రాగు నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పనుల కింద చేపట్టిన ఎస్సారెస్పీ కెనాల్ మరమ్మత్తు పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగునీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ కాలిందిని,సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని కలెక్టర్ సూచన



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి)**
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌లో వివరాలు సక్రమంగా నమోదు చేసుకోవడం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ హరిత తెలిపారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు, అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. 5-15 ఏళ్లలో 13,781 మంది, 15 ఏళ్లు పైబడిన 5,130 మంది ఇంకా అప్‌డేట్ చేయలేదని తెలిపారు. నీట్, ఈఎంసెట్ వంటి పరీక్షల్లో బయోమెట్రిక్ హాజరు కోసం కూడా ఆధార్ అవసరమని పేర్కొన్నారు.

## మరింత వేగిరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

### - మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగిరంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. మానకొండూర్ మండలం కొండపలకల గ్రామంలో బొంగోని కవితకృష్ణ, బొల్లం ఉమశ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు బుధవారం ఆయన హాజరయ్యారు.
ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పొందిన లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు మరింత వేగిరంగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇంటి పథకం సొంతింటి కలను సాకారం చేస్తున్నదని, అందుకే ఈ పథకానికి విశేష ఆదరణ లభిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని ఆయన చెప్పారు. అంతేకాకుండా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలు సత్వరం పరిష్కరించడం, దశల వారీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించడం వంటి తదితర సమస్యలతోపాటు రెవెన్యూశాఖకు



సంబంధించిన పలు అంశాలపై గురువారం హైదరాబాద్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొంటారని డాక్టర్ కవ్వంపల్లి వివరించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, కొండపలకల సర్పంచ్ మాడ లక్ష్మితిరుపతిరెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాములు గౌడ్, పార్టీ నాయకులు తోట శ్రీనివాస్, గడ్డం మార్కండేయ,నాగరాజు, బండి సంపత్, బండి వీరయ్య, పింగళి రవీందర్ రెడ్డి, కోంద్ర సురేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పడతాయి : మంత్రి వివేక్



**మంచిర్యాల /రామకృష్ణాపూర్ ఏప్రిల్ 29(వుదయం ప్రతినిధి)**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని రాష్ట్ర కార్మిక శాఖ, ఉపాధి కల్పన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా అండర్16 ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ పోటీల బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్ జట్టు మొదటి స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో రంగారెడ్డి జట్టు, మూడవ స్థానంలో ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు నిలిచాయి. ఏరియా జిఎం రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్, సిఐ రమేష్, ఏరియా ఆసుపత్రి డివైసిఎంఓ మధుకుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రఘునాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కట్ట ఈశ్వర చారి, నిర్వాహకులు పల్లె రాజు, ఓడ్నాల శ్రీనివాస్, పిఈటి లు దుబ్బ శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మంథని వ్యాపారాభివృద్ధి కోసమే రోడ్డు నిర్మాణం

### – జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్

**మంథని, వుదయం**
మంథని పట్టణాన్ని వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతోనే ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులను చేపట్టిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గం రాజేష్ తెలిపారు. బుధవారం మంథని గంగా ఒడ్డున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరిపై వంతెన రోడ్డు విస్తరణతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పట్టణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన రాజేష్, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రైతులను నష్టపరిచిన ఘనత గత పాలకులదేనని ఆరోపించారు. తక్కువ పరిహారం ఇచ్చి, అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేయించి రైతుల హక్కులను కాలరాసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు.
ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇస్తున్న రైతులకు మార్కెట్ విలువ కంటే ఎనిమిది నుంచి పది రెట్లు అధిక పరిహారం చెల్లిస్తోందని తెలిపారు. గంగపై నిర్మిస్తున్న వంతెనతో పాటు ఈ నూతన రహదారి పూర్తయితే మంథని పట్టణం వ్యాపారపరంగా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.రోడ్డు నిర్మాణం వల్ల కొందరికి మాత్రమే లాభమనే ప్రచారాన్ని ఖండించిన ఆయన, అభివృద్ధి అనేది ఒకరి కోసం కాకుండా మొత్తం పట్టణ ప్రజల ప్రగతిని దృష్టిలో పెట్టుకుని జరుగుతోందన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు ఇచ్చే మంచి సూచనలను ప్రభుత్వం స్వాగతిస్తుందని, అయితే నిరాధార విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. మంథని పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్ని అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్ పెంటరి రాజు, మాజీ సర్పంచులు ఆయిలి శ్రీనివాస్, వేల్పుల రాజు, దోరగొర్ల శ్రీనివాస్, నాయకులు మూల పురుషోత్తం రెడ్డి, నరెడ్ల ఓదెలు, గుండా పాపారావు, పేరవేణ లింగయ్య, శ్రీనివాస్, దిగంబర్, అనిల్, ఇందారపు అనిల్, కాశిపేట బాపు, సల్మాన్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

### - టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):**
కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని ఇస్రోజివాడి గ్రామంలో బుధవారం నూతన గృహప్రవేశ కార్యక్రమంలో టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఇంటికి సంబంధించిన వంట సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ద్వారా నిరుపేదలకు అండగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నారు. సొంత స్థలం లేని వారికి ఇండ్ల నిర్మాణం కోసం త్వరలో ప్రభుత్వము ఒక ప్రకటన చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జూలూరి సుధాకర్, నిమ్మ విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, గడ్డమీది మహేష్, క్రీడా అధ్యక్షులు నర్సాగౌడ్, మాజీ కౌన్సిలర్లు సలీం, పిడుగు సాయిబాబా, చింతల రవీందర్ గౌడ్, గౌరీ, నవీన్ కుమార్, నర్సొల్ల మహేష్, సుదర్శన్, కోటేశ్వర్ రాజశేఖర్, బండారి శ్రీకాంత్, గంగారం, మెహర్ బాబా, రాహుల్ , వార్డ్ మెంబర్ ప్రణీత్, అజీస్, శంకర్ పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష తులసి అర్చన

- ధర్మపురిలో వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు
- పురుషసూక్త, మన్యుసూక్త సహిత రుద్రాభిషేకాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం



**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో శ్రీ నృసింహ నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 8వ రోజున స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం నుండే ఆలయంలో వేదమంత్రాల ఘోషతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.స్వామివారికి పురుష సూక్త,శ్రీసూక్త,కల్పోక్త,న్యాసపూర్వక షోడశోపచార పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు.అనంతరం సహస్రనామార్చన, పంచోపనిషత్తులతో కూడినమన్య సూక్త పారాయణాల మధ్య రుద్రా భిషేక పూజలు వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. నవరాత్రోత్సవాల సందర్భంగా స్వామి వారికి నిర్వహించిన లక్ష తులసి అర్చ న భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.తదనంతరం సప్త హారతులు, భజన కార్యక్రమాలు, వేదమంత్ర పుష్పం వంటి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ,ముఖ్య అర్చకులు నంబి.శ్రీనివాసాచార్యులు,ఉప ప్రధాన అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్యులు,అర్చకులు సీహెచ్ రమణయ్య,నంబి నర్సింహమూర్తి,నేరేళ్ళ సంతోష్ కుమార్,వద్దిపర్తి కళ్యాణ్,సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్,అభిషేక పురోహితులు,స్థానిక వేద పండితులు,సీనియర్ అసిస్టెంట్ అల్వాల్. శ్రీనివాస్,భక్తులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం

### – రూ.50 లక్షల నిధులు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానం



**అదిలాబాద్, వుదయం ప్రతినిధి:**
అదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష తెలిపారు. మున్సిపాలిటీ వాహనాల నిర్వహణ సౌలభ్యం కోసం వాహన రిపేరింగ్ షెడ్డు, వాటర్ వాషింగ్ సదుపాయం మరియు మున్సిపాలిటీ సొంత గ్యారేజ్ ఏర్పాటు చేయడానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పట్టణంలోని అన్ని కమ్యూనిటీలకు చెందిన స్మశాన వాటికల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. స్ట్రీట్ లైట్ల మరమ్మత్తులు, వాటర్ సప్లై వ్యవస్థ బలోపేతం, పట్టణ మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ప్రత్యేక నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల చెల్లింపుల కోసం కూడా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో నీటి సరఫరా, శానిటేషన్, వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిలర్లు లేదా మున్సిపాలిటీ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వంగిన విద్యుత్ స్తంభాలు, మిడిల్ పోల్స్, థర్డ్ వైర్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల అవసరంపై విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించామని చెప్పారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 49 వార్డుల్లో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
రెవెన్యూ అధికారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులు మరియు ఇతర ధృవపత్రాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే పెన్షన్ పంపిణీ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ సిబ్బంది, గౌరవ కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జనాభా గణన సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

-కౌన్సిల్ సాధారణ స మావేశం..
-నూతన మున్సిపల్ కార్యాలయం ఏర్పాటుకు తీర్మానం...
-మున్సిపల్ ఛైర్పర్సన్ గొడిసెల సంధ్యారాణి
-మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్




**మంచిర్యాల /రామకృష్ణాపూర్ ఏప్రిల్ 29(వుదయం ప్రతినిధి)**
క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశము నిర్వహించారు. సమావేశంలో 36 అంశాలతో కూడిన ఎజెండాను ఇంచార్జ్ మేనేజర్ కే సతీష్ కౌన్సిల్ సభ్యులందరికి చదివి వివరించినట్లు తెలిపారు.36 అంశములను కౌన్సిల్ సభ్యులందరూ కూడా ఏకగ్రీవముగా ఆమోదించినట్లు తెలిపారు. అనంతరం వర్షాకాలములో వరద నీరు ఇండ్లలోనికి వస్తుందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బిబోన్ నుండి విద్యా నగర్ వరకు 400 మీటర్ల వర్షపు నీటి కాలువ నిర్మాణమునకు 2 కోట్ల మంజూరు గురించి చైర్ పర్సన్ సంధ్యారాణి కౌన్సిల్ సభ్యులకు తెలియజేసి ఆమోదింపచేసినట్లు తెలిపారు.మునిసిపల్ పరిధిలో గత కొన్ని సంవత్సరాల నుండి సింగరేణి స్థలాలలో ఇంటి నిర్మాణాలు నిర్మించుకుని 2,5000 వేలు డిడి ద్వారా చెల్లించిన సుమారు 1700 వందల మందికి జి.ఓ నెం.76 ప్రకారం పట్టా భూమి ఇప్పించుటకు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ ఆఫీసు భవనము పాతబడి ప్రస్తుత సిబ్బందికి సరిపోవడం లేదని, నూతన మున్సిపల్ ఆఫీసు భవన నిర్మాణమునకు సంబంధిత అధికారులకు 6 కోట్లు మంజూరు చేయుటకు లెటర్ ఇస్తామని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు చైర్పర్సన్ కు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.నీటి బోర్లలో నీరు ఎండిపోయి ప్రజలు నీటికి ఇబ్బంది పడుతున్నారని, కొత్త బోర్లు డ్రిల్లింగ్ చేపించి ఉన్న బోర్లకు మోటర్లు బిగించి ప్రజలకు నీటి సరఫరా చేయగలరని కోరారు. పట్టణములో కుక్కలు, కోతులు ప్రజలపై దాడి చేసి గాయ పరుస్తున్నాయని కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలని, కోతులను పట్టుకొని అడివిలో వదలగలరని కోరారు. పురపాలక సంఘం పరిధిలో ప్రజలు తమ ఇండ్లలోని చెత్తను మున్సిపల్ పారిశుద్య సిబ్బందికి ఇవ్వకుండా రోడ్లపై వేస్తున్నారని వారిపై తగిన చర్యలు తీసుకోగలరని కోరారు. వేసవి కాలములో అవసరం ఉన్న చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరడంతో అన్ని పనులు చేస్తామని కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కమీషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ... ఇంటి యజమాని చనిపోతే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 20 వేలు ప్రభుత్వము నుండి వస్తాయని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరినారు. ప్రభుత్వం చేపట్టబోయే జనాభా గనన తేదీ 11.05.2026 నుండి ప్రారంభమై తేదీ 09.06.2026 రోజున ముగిస్తున్నదని జనాభా గనన సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరినారు. మున్సిపల్ వైస్ చైర్పర్సన్ మిట్టపల్లి సరిత, కౌన్సిలర్లు, మున్సిపల్ డి ఈ సుమతి, ఎంఏఈ అశ్రిత్ , టిపిఎస్ బి రాజ్ కుమార్,కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## పది ఫలితాల్లో లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ









**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):**
కామారెడ్డి పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ విద్యార్థులు 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ స్వాతిప్రియ, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.పాఠశాలలో టాప్ 10 స్థానాలను ఎం. సుదీక్ష - 587 మార్కులు, జె. హర్షవర్ధిని - 585 మార్కులు, కె. బృంద - 583 మార్కులు, ఎన్. సాయి స్రిజ - 577 మార్కులు, పి. సంప్రీతి - 576 మార్కులు, ఎన్. రణేష్ రెడ్డి - 571 మార్కులు, కె. అమిత్ ప్రణవ్ - 571 మార్కులు, ఏ. దివ్య - 570 మార్కులు, ఐ. చేతన్ సాయి - 569 మార్కులు, పి. సోనల్ - 569 మార్కులు సాధించారు. మొత్తం 69 మంది విద్యార్థులలో గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి మంచి ఫలితాలను నమోదు చేశారు ఈ విజయాలు విద్యార్థుల కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల సమర్థమైన మార్గదర్శకత్వం ఫలితమని పాఠశాల యాజమాన్యం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తూ పాఠశాలకు అభినందనలు తెలిపారు. యాజమాన్యం మాట్లాడుతూ, "మా విద్యార్థులు సాధించిన ఫలితాలు మా పాఠశాల నాణ్యతను ప్రతిబింబిస్తున్నాయి. భవిష్యత్తులో ఉన్నత ఫలితాలను సాధించే దిశగా మేము కృషి కొనసాగిస్తాము" అని తెలిపారు. విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఇతర విద్యార్థులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

### - జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

**జగిత్యాల (వుదయం ప్రతినిధి)**
జగిత్యాల రూరల్ మండలం లోని చలిగల్ తాటిపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా వేగంగా కొనుగోలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు తూకం విధానాన్ని 17శాతం తేమ నిర్వహణను కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యంపై ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం తప్పనిసరిగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్ళు చేయాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా తక్షణమే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు క్లస్టర్ అధికారులకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన బరువు యంత్రాల నిర్వహణ ఓఆర్ఎస్ ప్యాకెట్స్ త్రాగునీరు షేడ్ నెట్ ల ఏర్పాటు ధాన్యం కొనుగోళ్ళు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు ఆర్డీవో మధు సూదన్ డిఆర్డిఓ రఘువరన్ ఎమ్మార్వో ఎంపీడీవో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# చక్కని ఆరోగ్యం

# వేసవిలో చర్మ సంరక్షణ కోసం..!



వేడి, ఉక్కపోత, జిడ్డుదనం.. మొదలైన సమస్యలను ఎదుర్కొని వేసవిలో చర్మాన్ని సంరక్షించుకోవడమంటే సవాలనే చెప్పాలి. అయితే తెలిసో, తెలియకో చేసే చిన్న చిన్న పొరపాట్లు ఈ కాలంలో చర్మ సౌందర్యాన్ని మరింత దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. ఆ పొరపాట్లేంటో తెలుసుకొని సరిదిద్దుకుంటే అందంగా మెరిసిపోవచ్చంటున్నారు. ఆయా కాలాల్ని బట్టి సంపూర్ణ ఆరోగ్యం కోసం మన జీవనశైలిలో మార్పులు చేసుకున్నట్లే.. చర్మ సంరక్షణ విషయంలోనూ బ్యూటీ రొటీన్‌లో పలు మార్పులు తప్పనిసరి అంటున్నారు నిపుణులు. ఇవేవీ పట్టించుకోకుండా చేసే కొన్ని పొరపాట్లు ఈ కాలంలో చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు. కాలమేదైనా ఎండ నుంచి చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్ లోషన్లు రాసుకోవడం అందరూ చేసేదే. అయితే వీటిని కూడా కాలాల్ని బట్టి మార్చాలంటున్నారు నిపుణులు. ప్రస్తుతం సన్‌స్క్రీన్లు తేలికపాటి లోషన్లు, జెల్స్, స్ప్రేలు, ఫోమ్స్.. ఇలా వివిధ రూపాల్లో మార్కెట్లో దొరుకుతున్నాయి. వివిధ క్రీముల మాదిరి ఇవి చర్మంపై పేరుకుపోకుండా సులభంగా చర్మంలోకి ఇంకిపోయి రక్షణ కల్పిస్తాయి. కాబట్టి చర్మతత్వాన్ని బట్టి ఇలాంటి తేలికపాటి ఉత్పత్తుల్ని ఎంచుకోవడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. అలాగే బయటికి వెళ్లినప్పుడే కాదు.. ఇంట్లో ఉన్నప్పుడూ నిర్ణీత వ్యవధుల్లో సన్‌స్క్రీన్ తప్పకుండా అప్లై చేసుకోవాలి.. అని సూచిస్తున్నారు. వేసవిలో చెమట, ఉక్కపోత వల్ల అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. అందుకే పదే పదే ముఖం కడుగుతుంటారు చాలామంది. ఈ అలవాటూ మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇలా పదే పదే ముఖాన్ని శుభ్రం చేసుకోవడం వల్ల చెమట, జిడ్డు తొలగిపోయి కాసేపటి దాకా బాగానే అనిపిస్తుంది. కానీ దీనివల్ల ముఖం మరింత జిడ్డుగా మారి మొటిమలకు దారితీస్తుందని చెబుతున్నారు. అందుకే రోజూ రెండు లేదా మూడుసార్లకు మించి ముఖం కడుక్కోవద్దని, అది కూడా రసాయనాల్లేని సహజసిద్ధమైన సబ్బులు, ఫేస్‌వాష్‌లు వాడడం మంచిదంటున్నారు. ఈ వేసవిలో చాలామంది చేసే పొరపాటు మాయిశ్చరైజర్ రాసుకోకపోవడం. ఈ కాలంలో దీని అవసరం ఉండదనుకుంటారు. కానీ ఈ నిర్లక్ష్యం వల్ల చర్మం పొడిబారిపోయే ప్రమాదం ఎక్కువంటున్నారు. అదెలాగంటే.. పదే పదే ఎండలోకి వెళ్లడం వల్ల చర్మం కింది పొర డీహైడ్రేట్ అవుతుందట! ఫలితంగా చర్మం తేమను కోల్పోయి నిర్జీవంగా కనిపిస్తుంది. అందుకే ఈ కాలంలోనూ మాయిశ్చరైజర్ మానద్దంటున్నారు నిపుణులు. కాకపోతే.. చర్మతత్వాన్ని బట్టి తేలికపాటి, నీటి ఆధారిత మాయిశ్చరైజర్లను ఎంపిక చేసుకోవడం మంచిదని చెబుతున్నారు. చర్మ సంరక్షణలో భాగంగా మృతకణాల్ని ఎప్పటికప్పుడు తొలగించడం కూడా ముఖ్యమే! అయితే ఇందుకోసం స్క్రబ్స్ వాడడం తెలిసిందే! వేసవి కాలానికి అనుగుణంగా, చర్మ తత్వాన్ని దృష్టిలో పెట్టుకొని వీటినీ మార్చాలంటున్నారు నిపుణులు. ఎక్కువ బరకగా ఉండేవి పక్కన పెట్టి.. కాఫీ పొడి–కొబ్బరి నూనె, ఓట్‌మీల్–పెరుగు.. వంటి తేలికపాటి స్క్రబ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. ఇవి చర్మానికి తేమనందించడంతో పాటు చర్మాన్ని మృదువుగా మార్చుతాయని చెబుతున్నారు. అయితే ఇవి చర్మ తత్వానికి సరిపడతాయో లేదో ముందుగా పరీక్షించి చూసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# మచ్చ పడకుండా



మైదానంలో ఆటలాడుతూ కింద పడొచ్చు. చర్మం గీసుకుపోయి, గాయం కావొచ్చు. ఇంట్లో కూరగాయలో, మరేదో కోస్తున్నప్పుడు పొరపాటున గాటు పడొచ్చు. పెద్దగా పట్టించుకోకుండానే ఇవి మానిపోతాయి కూడా. కానీ అక్కడ మచ్చ పడుతుంది. వీటిని నివారించుకోవటం లేదా పెద్దగా కనిపించకుండా చూసుకోవటమెలా? గాయమైన తర్వాత మచ్చ పడటానికి కారణం చర్మం లోపలి పొర (డెర్మిస్) చీరుకుపోవటం. అక్కడ చర్మం మరమ్మతు కావటానికి శరీరం కొలాజెన్ పోచలను ఉత్పత్తి చేస్తుంది. ఇవి బాగానే గాయాన్ని మాన్పుతాయి గానీ చర్మం పూర్తిగా మునుపటిలా కుదురుకోదు. అసలు చర్మం కన్నా భిన్నంగానే ఉంటుంది. ఇదే మచ్చలకు దారితీస్తుంది. అయితే గాయమైన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నామనేది మచ్చల తీవ్రత మీద ప్రభావం చూపుతుంది. వాపును తగ్గించుకోవటం, మరింత దెబ్బతినకుండా చూసుకోవటం ద్వారా మచ్చను తగ్గించుకునే అవకాశముంది. గాయాన్ని పొడిగా ఉంచితే త్వరగా మానుతుందని చిన్నప్పటి నుంచీ వింటూనే ఉంటాం. నిజానికి తేమగా ఉంచితేనే మేలు. తేమ మూలంగా గాయం పొడిబారకుండా ఉంటుంది, గట్టి పక్కు ఏర్పడుతుంది. ఇది కణజాలం ఎక్కువగా దెబ్బతినకుండా, మచ్చ గాఢంగా ఏర్పడకుండా కాపాడుతుంది. గాయాన్ని కప్పి ఉంచటం ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా కాపాడుతుంది కూడా. గాయాన్ని మృదువైన సబ్బు, నీటితో శుభ్రం చేస్తే బ్యాక్టీరియా తొలగిపోతుంది. దీనికి మచ్చకు ఏంటీ సంబంధం? బ్యాక్టీరియా వాపును ప్రేరేపిస్తుంది. ఇది గాయం మానే ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తుంది. ఫలితంగా మరింత గాఢంగా మచ్చ ఏర్పడుతుంది. ఇన్‌ఫెక్షన్ తలెత్తినా గాయం మానటం ఆలస్యమవుతుంది. ఇదీ మచ్చ ఎక్కువయ్యేలా చేస్తుంది. అక్కడ చర్మం పైకి లేచి బుడిపెగానూ మారొచ్చు. గాయం మీద కట్టే పక్కు చర్మానికి సహజ రక్షణగా నిలుస్తుంది. గాయం పూర్తిగా మానిన తర్వాత దానంతటదే ఊడి వస్తుంది. కాబట్టి వేళ్లు అక్కడికి పోనివ్వకుండా చూసుకోవాలి. దురద పెడుతుందనో, మరో కారణంతోనో గోకొద్దు. పక్కును తొలగిస్తే గాయం త్వరగా మానదు. మచ్చ పెద్దగా పడుతుంది. గాయమైన చోటును కదపకుండా స్థిరంగా ఉంచాలి. అప్పుడు గాయానికి రెండు వైపులా చర్మం అంచులు సరిగ్గా అతుక్కుంటాయి. మచ్చ పెద్దగా పడదు. అదేపనిగా కదిపితే మాత్రం చీలిక పెద్దగా అయ్యి, మందంగా మచ్చ పడే అవకాశముంది. మచ్చ పడిన చోట కొద్దిసేపు మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవటమూ మేలే. గాయం పూర్తిగా మానిన ఏడాది లోపు దీంతో మంచి ఫలితం కనిపిస్తుంది. మందంగా మారే అవకాశం గల మచ్చ కణజాలాన్ని ఇది విచ్ఛిన్నం చేస్తుంది. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాలు వర్ణద్రవ్యాన్ని పెంచటం ద్వారా మచ్చలు స్పష్టంగా కనిపించేలా చేస్తాయి. ఈ కిరణాలు కొలాజెన్‌నూ దెబ్బతీస్తాయి. గాయాలు నయమయ్యే ప్రక్రియ కూడా నెమ్మదిస్తుంది. ఇదీ మచ్చలు తీవ్రం కావటానికి దారితీస్తుంది. మచ్చల మీద సన్‌స్క్రీన్ రాసుకోవటం లేదా ఎండ పడకుండా చూసుకుంటే అవి తక్కువగా కనిపించే అవకాశముంది.

# ఇమ్యూనిటీ పెరగాలంటే..!

రోగనిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉంటే వివిధ వైరస్లు, బ్యాక్టీరియాలు మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేవు. అయితే రోగనిరోధక శక్తి దృఢంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారమూ ముఖ్యమే! అందులోనూ కొన్ని విటమిన్లుండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడే విటమిన్లలో విటమిన్ 'సి'ది కీలక పాత్ర. ఈ విటమిన్ లోపం ఉన్న వాళ్లు త్వరగా జబ్బు పడే అవకాశాలుంటాయి. అందుకే మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ 'సి' పుష్కలంగా లభించే కమలాఫలం, నిమ్మకాయ.. వంటి నిమ్మజాతి పండ్లను భాగం చేసుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అలాగే పాలకూర, క్యాప్సికం.. వంటివి కూడా మెనూలో చేర్చుకోవాలి.

రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో విటమిన్ 'బి6' సహకరిస్తుంది. కాబట్టి ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే విటమిన్ 'బి6' అధికంగా లభించే అరటిపండ్లు, బంగాళాదుంపలు, చికెన్, చేపలు, శెనగలు.. వంటి ఆహార పదార్థాల్ని రోజువారీ మెనూలో భాగం చేసుకోవాలట. విటమిన్ 'ఇ' మన శరీరంలో ఒక శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్, ఇతర ఇన్ఫెక్షన్లతో సమర్థంగా పోరాడి.. అవి మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపకుండా కాపాడుతుంది. అలాగే ఈ విటమిన్ రోగనిరోధక వ్యవస్థను పటిష్టపరచడంలోనూ సహకరిస్తుంది. కాబట్టి ఇది ఎక్కువగా లభించే పొద్దుతిరుగుడు గింజలు, పల్లీలు, బాదంపప్పులు, పాలకూర, నట్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు. ఈ విటమిన్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. అలాగే విటమిన్ 'ఎ' కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. కాబట్టి క్యారట్స్, తర్బూజా, గుమ్మడికాయ, సొరకాయ.. వంటి విటమిన్ 'ఎ' ఎక్కువగా లభించే ఆహార పదార్థాల్ని తీసుకోవడం మంచిదంటున్నారు. రోగనిరోధక వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి, దాని రక్షణకు విటమిన్ 'డి' ఎంతగానో తోడ్పడుతుంది. కాబట్టి ఈ విటమిన్‌ను పొందడానికి ఉదయాన్నే లేలేత ఎండలో 10 నుంచి 30 నిమిషాల పాటు పాటు గడపాలి. అలాగే ఇది అధికంగా లభించే చేపలు, కోడిగుడ్లు, పాలు,.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్ 'డి' వల్ల ఎముకలు కూడా దృఢంగా మారతాయని చెబుతున్నారు నిపుణులు.




# కండర బలానికి ప్రొటీన్ ఒక్కటే కాదు

వయసు మీద పడుతున్న కొద్దీ కండరాలు క్షీణిస్తూ వస్తుంటాయి. వీటిని కాపాడుకోవటానికి ఏం తినాలి? అనగానే ప్రొటీన్‌తో నిండిన గుడ్లు, మాంసం వంటివే గుర్తుకొస్తుంటాయి. కండరాలు ఏర్పడటానికి, మరమ్మతు కావటానికి, క్షీణించకుండా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరమే. కానీ ఇదొక్కటే కాదు, కండర క్షీణతను తగ్గించటానికి ఇతరత్రా పోషకాలూ అవసరమే. ఎందుకంటే ఇతర స్థూల, సూక్ష్మ పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు, ద్రవాలు, వ్యాయామంతో కలిసి ప్రొటీన్ కండరాలను కాపాడుతుంది మరి.



మలి వయసులో ఎంతో కొంత కండర మోతాదు తగ్గటం సహజమే. దీన్ని నిలువరించకపోతే కింద పడిపోవటం, ఎముకలు విరగటం, ఇతరుల మీద ఆధారపడాల్సి రావటం, రోజువారీ పనులు సరిగా చేసుకోలేకపోవటం వంటి ఇబ్బందులకు దారితీస్తుంది. మంచి విషయం ఏంటంటే కొన్ని జాగ్రత్తలతో కండరాలను కాపాడుకునే వీలుండటం. సమతులాహారం తినటంతో పాటు తగినంత వ్యాయామం చేయటం చాలా ముఖ్యం. ఇందుకు ప్రొటీన్‌తో పాటు ఇతర కీలక పోషకాల మీదా దృష్టి సారించటం మంచిది. శరీరానికి ప్రధానమైన శక్తి వనరులు ఇవే. మనం ఆహారం ద్వారా తీసుకున్న పిండి పదార్థంలో కొంత కండరాల్లో గ్లైకోజన్ రూపంలో నిల్వ ఉంటుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు శరీరం దీన్ని వాడుకుంటుంది. పిండి పదార్థం ఎప్పటికప్పుడు దీన్ని భర్తీ చేస్తుంది. ఒకవేళ తగినంత పిండి పదార్థం తీసుకోకపోతే శరీరం శక్తి కోసం కండర కణజాలాన్ని ఉపయోగించుకుంటుంది. ఇది కండర క్షీణతకు దారితీస్తుంది. అయితే నిండు గింజ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పప్పులతో లభించే నాణ్యమైన పిండి పదార్థాన్ని తీసుకోవటం మంచిది. ఇది మన శరీరంలో 300కు పైగా జీవరసాయన చర్యల్లో పాలు పంచుకుంటుంది. వీటిల్లో చాలావరకూ కండర ఆరోగ్యంతో నేరుగా ముడిపడినవే కావటం గమనార్హం. కండరాల సంకోచం, వ్యాకోచం వంటి పనులు సజావుగా సాగటానికి మెగ్నీషియం అవసరం. ఇది ప్రొటీన్ల ఉత్పత్తి కావటానికి, వాపుప్రక్రియ తగ్గటానికీ తోడ్పడుతుంది. ఇలా కండర మరమ్మతు ప్రక్రియ సాఫీగా జరిగేలా చేస్తుంది. ఆకుకూరలు, చిక్కుళ్లు, పప్పులు, గింజ పప్పులు, విత్తనాలు, నిండు గింజ ధాన్యాల్లో మెగ్నీషియం దండిగా ఉంటుంది. అయితే ఆకలి, పోషకాలను శోషించుకునే సామర్థ్యం తగ్గటం వల్ల వృద్ధుల్లో చాలామందికి ఆహారం ద్వారా తగినంత మెగ్నీషియం అందదని గుర్తుంచుకోవాలి. దీన్ని ఒక పోషకంగా ఎవరూ గుర్తించరు. కానీ మనం జీవించి ఉండటానికిది తప్పనిసరి. కండర మోతాదులో 76% వరకూ ఉండేది ఇదే. అందువల్ల కండర సామర్థ్యం పెరగాలన్నా, సజావుగా పనిచేయాలన్నా, కండరాలు క్షీణించకుండా ఉండాలన్నా తగినంత నీరు తాగటం ముఖ్యం. వృద్ధులకు దాహం వేస్తున్న సంగతి సరిగా తెలియదు. అందువల్ల సరిగా నీరు తాగరు. దీంతో ఒంట్లో నీటి శాతం తగ్గుతుంది. ఇది కండర ప్రొటీన్ విచ్ఛిన్నమయ్యే ముప్పు పెరిగేలా చేస్తున్నట్టూ అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి భోజనం చేసినప్పుడే కాకుండా రోజంతా అప్పుడప్పుడు నీరు తాగేలా చూసుకోవాలి. రక్తం ద్వారా ఆక్సిజన్‌ను చేరవేయటం, శక్తి ఉత్పత్తి చేయటం ద్వారా ఐరన్ కండరాల పనితీరులో ముఖ్య భూమిక పోషిస్తుంది. దీని మోతాదులు తగ్గితే కండర కణాల్లో ఆక్సిజన్‌ను నిల్వ చేసే మయోగ్లోబిన్ అనే ప్రొటీన్‌ను సరిగా ఉత్పత్తి కాదు. దీంతో కండర సామర్థ్యం తగ్గుతుంది. ఐరన్ లోపం రక్తహీనతకూ దారితీస్తుంది. ఇందులో కణజాలాలకు ఆక్సిజన్‌ను చేరవేసే ఎర్ర రక్తకణాల సంఖ్య, హీమోగ్లోబిన్ మోతాదులు పడిపోతాయి. ఇది కండరాలకూ చేటు చేస్తుంది. చికెన్, మాంసం, చేపలు, టోఫు, పప్పులు, ఐరన్ కలిపి తయారుచేసే తృణధాన్యాలతో ఐరన్ లభిస్తుంది. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయనే సంగతి తెలిసిందే. మంచి కొవ్వుల తరగతికి చెందిన వీటి వాపు నివారణ గుణాలు కండరాలకూ మేలు చేస్తాయి తెలుసా? కణ స్థాయిలో తలెత్తే వాపు ప్రక్రియ దీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తుంటే కండరాలూ దెబ్బతింటాయి మరి. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో ప్రొటీన్ల ఉత్పత్తి, కణజాలాల మరమ్మత్తు మెరుగవుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

# పక్షవాతానికి కొత్త చికిత్స

ప్రపంచవ్యాప్తంగా వైకల్యం, మరణానికి దారితీస్తున్న ప్రధాన కారణాల్లో పక్షవాతం ఒకటి. దీన్నుంచి బతికి బయటపడ్డ వారిలో ఎంతోమంది సరిగ్గా కదల్లేక, ఇంటికే పరిమితమవుతున్నారు. ఇలాంటి దుస్థితిని తప్పించటానికి పరిశోధకులు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. మెదడు దెబ్బతినటాన్ని నివారించటానికి, పక్షవాతం అనంతరం నాడులు తిరిగి కోలుకోవటానికి తోడ్పడే కొత్త చికిత్సల కోసం అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్తనాళం ద్వారా ఇచ్చే (ఐవీ) తాజా చికిత్స ఒకటి మేలి మలుపుగా కనిపిస్తోంది. ఇది మెదడు ఎక్కువగా దెబ్బతినకుండా చూడటంతో పాటు మరింత బాగా కోలుకునేలా చేస్తుండటం గమనార్హం. దీని



ప్రాథమిక ఫలితాలు న్యూరోథెరప్యూటిక్స్ పత్రికలో ప్రచురితమయ్యాయి. పక్షవాతం వచ్చినప్పుడు దెబ్బతినే అవకాశం గల మెదడు కణజాలం చుట్టూ ఇది 'పొర'లా ఏర్పడటం ద్వారా నాడులు చనిపోకుండా కాపాడుతున్నట్టు, వాపు ప్రక్రియను తగ్గిస్తున్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు. పక్షవాతం బారినపడ్డప్పుడు తొలి 6–12 గంటల్లో ఈ మందును రక్తనాళం ద్వారా ఇవ్వాల్సి ఉంటుంది. ఇది మెదడులోని భాగాలు దెబ్బతినటాన్ని తగ్గిస్తున్నట్టు కొందరిపై నిర్వహించిన ప్రయోగ పరీక్షల్లో తేలటం గమనార్హం. అలాగే మాటలు, కదలికలు త్వరగా తిరిగి వచ్చినట్టూ బయటపడింది. ఒక్క ప్రామాణిక చికిత్స మాత్రమే తీసుకున్నవారితో పోలిస్తే వీళ్లు రోజువారీ పనులు మరింత త్వరగా చేసుకునే విధంగా కోలుకున్నట్టూ వెల్లడైంది. చికిత్సను బాగా తట్టుకోవటం, తీవ్రమైన దుష్ప్రభావాలేవీ లేకపోవటం మరో మంచి విషయం.

# 'ఎరుపు' ఎంతో బలం!



ఎర్రెర్రటి స్ట్రాబెర్రీని చూడగానే నోట్లో నీళ్లూరిపోతాయి. కెంపు రంగులో మెరిసే దానిమ్మ గింజల్ని అలా చటుక్కున నోట్లో పెట్టుకోవాలనిపిస్తుంది. అల్లంత దూరం నుంచే ఎర్రటి పుచ్చకాయ ముక్కలు కడుపు నింపేస్తాయి. ఇవేనా... రెడ్ కలర్ కూరగాయలూ, ఆకుకూరలన్నీ కూడా తినకముందే రంగుతోనే ఆకట్టుకుంటాయి. అయితే ఆ మెరిసే వర్ణం కేవలం ఆకర్షణ కోసమే కాదు, ఆరోగ్యాన్ని అందించే ప్రత్యేక కారకం కూడా. మరీ ముఖ్యంగా మండుటెండల్లో ఈ ఎరుపు రంగు ఆహారపదార్థాలతో ఎన్నెన్నో లాభాలున్నాయి. ఆసక్తికరమైన ఆ వివరాల్లోకి వెళితే... ప్రకృతి ప్రసాదించిన పండ్లూ, కూరగాయల్లో– ఆకుపచ్చ, పసుపు, ఊదా, తెలుపు, నీలం, ఎరుపు... ఇలా బోలెడు రంగులు ఉంటాయి. వాటిల్లో రుచి మీదనే ఎక్కువగా ఫోకస్ చేస్తూ ఆయా పదార్థాల్ని మనం రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటాం కానీ– వాటి రంగును బట్టి అవి ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలూ ఉంటాయని తెలుసా? అందులోనూ అన్ని వర్ణాల్లో హైలైట్ అయ్యే రెడ్ ఫుడ్ ప్రత్యేకత ఏంటో ఎప్పుడైనా విన్నారా? ఆకట్టుకునే ఈ కలర్‌ఫుల్ ఆహారం– శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తూనే, రోగాలు దరిచేరకుండా కాపాడుతుంది. మిగతా వాటితో పోల్చితే బెస్ట్ సూపర్‌ఫుడ్‌గా పేరు తెచ్చుకున్న ఈ ఎర్రటి ఆహార పదార్థాల పూర్తి కథ తెలిసిందంటే కచ్చితంగా మీరూ ఈ రెడ్‌ఫుడ్‌తో ప్రేమలో పడిపోవాల్సిందే! మామూలుగా ప్రకాశవంతమైన ఎరుపు రంగును– శక్తికీ, ధైర్యానికీ, ప్రేమకీ గుర్తుగా చెబుతుంటాం కదా. అదే రంగు– పండ్లూ, కూరగాయలూ, ఆకుకూరల పోషక విలువల్నీ పెంచింది మరి. విటమిన్లూ, ఖనిజాలతో నిండిన ఈ పదార్థాలు శరీరంలో అన్నింటి కన్నా ముఖ్యమైన గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయట. అందుకే, రెడ్‌ఫుడ్‌ని 'కలర్ ఆఫ్ ది హార్ట్'గా పిలుస్తున్నారు. అసలింతకీ ఈ రంగుకి కారణం ఏంటీ అంటే... పండ్లూ, కూరగాయల్లో క్లోరోఫిల్ వర్ణద్రవ్యం ఉండటం వల్ల వాటికి ఆకుపచ్చ రంగు వస్తే, పసుపు రంగు రావడానికి కారణం అందులోని కెరోటినాయిడ్లు. అదే వాటిలో లైకోపీన్, యాంతోసయానిన్లు అనే పిగ్మెంట్లు ఉండటం వల్ల ఆహార పదార్థాలు ఎర్రని ఎరుపు రంగులోకి మారుతుంటాయి. ఈ వర్ణద్రవ్యాలు రంగుతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల్నీ అందిస్తాయి. పూర్వకాలంలో ఆ రంగు గొప్పతనం వల్లనే ఈజిప్షియన్లూ, గ్రీకులూ దానిమ్మ పండును పవిత్రమైన పండుగా భావించేవాళ్లట. దీన్ని ఆయుర్దాయాన్ని పెంచే ఆహారంగా కూడా చెప్పుకునేవాళ్లు. ఇంకా రోజూ తప్పకుండా తినే ఎర్రటి ఆహార పదార్థాల్లో మొదటిది కచ్చితంగా టొమాటోనే అని చెబుతాం కదా. కానీ ఒకప్పుడు దీని ఆకర్షణీయమైన రంగును చూసి, టొమాటో మొక్కల్ని కేవలం అలంకరణ కోసం పెంచేవాళ్లట. తర్వాత ఆ పండులోని పోషకాల సంగతి తెలిశాక, ప్రపంచ దేశాల్లో తప్పనిసరి ఆహారంగా మారింది! నిజానికి తాజా పండ్లూ, కూరగాయలంటేనే ఆరోగ్యం కదా! అందులో మళ్లీ రంగుదేముందీ



అంటారేమో కానీ– అది పోషకాల మీద ఎంతో ప్రభావం చూపిస్తుంది. ఆ ముదురు రంగు అందులోని అధిక యాంటీఆక్సిడెంట్లను సూచిస్తుంది. ఇంకా ఎ,సి– విటమిన్లూ, పొటాషియం, ఫైబర్, ఖనిజాల్లాంటివి ఎక్కువగా ఉండే ఈ రెడ్ కలర్ ఫుడ్‌లో రెట్టింపు పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా దీంట్లోని లైకోపీన్ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే ఈ పిగ్మెంట్ ఎక్కువగా ఉండే టొమాటో మొదలు పుచ్చకాయ వరకూ రకరకాల ఎర్రటి ఆహార పదార్థాలు– రక్తపోటును నియంత్రిస్తూ గుండె జబ్బులూ రాకుండా కాపాడతాయి. ఎరుపు రంగు ఆహార పదార్థాల్లోని ఫైటో కెమికల్స్ క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్, లంగ్ వంటి క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటాయి. ఇవి మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఎండాకాలంలో ఈ రెడ్‌ఫుడ్ చర్మ రక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది. తీవ్రమైన సూర్యకిరణాల నుంచి కాపాడుతూనే, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడానికి సాయపడుతుంది. నీరసాన్ని తగ్గించి, తక్షణ శక్తిని ఇస్తుంది. వేసవిలో కుదిరినప్పుడల్లా పుచ్చకాయను తినడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవకుండా ఉంటుంది. ఎర్రటి ఆహారపదార్థాల్లోని బెటాలెయిన్స్ వల్ల శరీరంలోని వ్యర్థాలు సులువుగా బయటకు వెళతాయి. వీటిల్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలోని వాపుల్నీ, నొప్పుల్నీ తగ్గిస్తాయి. సి–విటమిన్ ఎక్కువ ఉండే ఈ పదార్థాల ద్వారా వ్యాధినిరోధక శక్తి బాగా పెరుగుతుంది. సీజనల్ వ్యాధులూ, ఇన్‌ఫెక్షన్లూ తగ్గుతాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. రెడ్ ఫుడ్‌లోని బీటా కెరోటిన్ వల్ల కంటి ఆరోగ్యమూ బాగుంటుంది. కంటి సమస్యలు ఉన్నవారు నిత్యం దీన్ని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. రాస్‌బెర్రీ, చెర్రీ తదితర పండ్లను రోజూ తినడం వల్ల జీర్ణసంబంధ వ్యాధులూ దరిచేరవట. దానిమ్మ గింజల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వాపును తగ్గిస్తాయి. చక్కెర స్థాయుల నియంత్రణకూ దానిమ్మ పండును తినొచ్చు. రోజూ ఈ ఎర్రటి కాయగూరల్ని తినడం వల్ల పురుషులలో సంతానోత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పరిశోధనల్లో బయటపడింది.

బీట్‌రూట్ రక్తహీనతను తగ్గించి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రెడ్ క్యాప్సికంతో శరీరానికి కావాల్సినంత సి–విటమిన్ అందుతుంది. ఎర్ర మిరపకాయల్లో క్యాన్సర్లతో పోరాడే గుణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎర్రటి తోటకూరలో ఐరన్ తగినంత దొరుకుతుంది. ఇది హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనతను తగ్గిస్తుంది.

యాంతోసయానిన్లు దండిగా ఉండే ఈ రెడ్ ఫుడ్– మెదడు పనితీరుకీ, నాడీ వ్యవస్థకీ ఎంతో మంచిది. ఈ వర్ణద్రవ్యం రక్త ప్రసరణను మెరుగుపరిచి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. దానిమ్మ, చెర్రీలతోపాటు ఎర్ర ఉల్లిపాయ,ఎర్ర ముల్లంగి, రెడ్ క్యాబేజీ... తదితర కాయగూరల్లోనూ ఈ యాంతోసయానిన్లు అధికంగా ఉంటాయి.ట్రైగ్లిజరైడ్లూ, కొలెస్ట్రాల్‌ని నియంత్రించడంలోనూ ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.



బరువు తగ్గాలనుకునేవాళ్లకూ ఎర్రటి ఆహారపదార్థాలు బాగా ఉపయోగపడతాయి. తక్కువ క్యాలరీలూ, ఎక్కువ ఫైబర్‌తో ఉండే వీటితో జీవక్రియ పనితీరు సజావుగా జరుగుతుంది. స్ట్రాబెర్రీ పండ్ల నుంచి ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, సి,కె–విటమిన్లు అధికంగా లభిస్తాయి. ఎర్రటి క్రాన్‌బెర్రీ పండు... పొట్ట అల్సర్‌కి కారణమయ్యే బ్యాక్టీరియాని చంపుతుంది. మూత్రనాళంలో బ్యాక్టీరియా పేరుకుపోకుండా కాపాడుతుంది. ఎముక బలానికీ ఎర్రటి ఈ కాయగూరలూ, పండ్లూ ఎంతో ఉపయోగపడతాయట.

## మే నెలలో బ్యాంకులకు 9 రోజుల సెలవులు



బ్యాంకింగ్ సేవలు మొబైల్‌తో పొందే సౌలభ్యం వచ్చినప్పటికీ.. నేటికీ బ్యాంక్ బ్రాంచికి వెళ్తే గానీ కొన్ని పనులు కాని పరిస్థితి ఉంది. మే నెలలో అలాంటి ప్రణాళికలు ఏమైనా ఉంటే సెలవుల గురించి తెలుసుకోవడం ముఖ్యం. మే నెలలో బ్యాంకులు మొత్తం 9 రోజులు పాటు తెరుచుకోవు. మే 1న మేడే, మే 27న తేదీ బక్రీద్ సందర్భంగా బ్యాంకులు పనిచేయవు. దీనికి 2, 4 శనివారాలు, ఆదివారాలు అదనం. మే నెలలో 5 ఆదివారాలు రానుండడంతో మొత్తం 9 రోజుల పాటు బ్యాంకులు పని చేయవు. తేదీలు ఇవే..: మే-1 శుక్రవారం, మే-3 ఆదివారం, మే-9 రెండో శనివారం, మే-10 ఆదివారం, మే-17 ఆదివారం, మే-23 నాలుగో శనివారం, మే-24 ఆదివారం, మే-27 బక్రీద్, మే-31 ఆదివారం సందర్భంగా బ్యాంకులు తెరుచుకోవు. కాబట్టి మిగిలిన రోజుల్లో మీ బ్యాంకు పనులు ప్లాన్ చేసుకోండి.




# విమాన ఇంధన ధరల నుంచి ఉపశమనం ఇవ్వండి

### ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్



ముంబయి: దేశంలో విమానయాన రంగం తీవ్రమైన ఒత్తిడిలో ఉందని.. ఆర్థిక ఒత్తిళ్ల వల్ల కార్యకలాపాలు నిలిపి వేయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రభుత్వానికి ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్ తెలిపాయి. విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలను నిర్ణయించే పద్ధతిని మార్చడంతో పాటు విమానయాన సంస్థలకు సత్వరం ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరాయి. పశ్చిమాసియా యుద్ధం వల్ల చమురు ధరలు భారీగా పెరిగాయి. దీనికి తోడు వివిధ దేశాలు తమ గగనతలంపై ఆంక్షలు విధించడం వల్ల, అంతర్జాతీయ మార్గాల్లో వెళ్లాల్సిన విమానాలు అధికదూరం చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నాయి. ఇందువల్ల విమాన ఇంధనం అధికంగా ఖర్చవడంతో పాటు, సిబ్బంది వ్యయాలూ అధికమవుతున్నాయి విమానయాన సంస్థల సంఘం ఏమంటోందంటే..: ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ (ఎఫ్ఐఏ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. దేశీయ విమానయాన రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, తక్షణ ఆర్థిక తోడ్పాటు లభించకపోతే విమానాలను నిలిపివేయడం లేదా రద్దు చేయడం మినహా వేరే మార్గం లేదని ఎఫ్ఐఏ హెచ్చరించింది. ఈనెల 1న ఏటీఎఫ్ ధరల సవరణ సమయంలో, దేశీయ కార్యకలాపాల కోసం ఏటీఎఫ్ ధర పెంపును లీటరుకు రూ.15కు ప్రభుత్వం పరిమితం చేసింది. కానీ అంతర్జాతీయ కార్యకలాపాల కోసం లీటరుకు రూ.73 చొప్పున పెంచింది. ఈ నిర్ణయం అంతర్జాతీయ విమాన సర్వీసులను భారంగా మార్చిందని సంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి. ప్రస్తుతం ఏటీఎఫ్‌పై ఉన్న 11% ఎక్సైజ్ సుంకాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని కోరాయి. 2022 అక్టోబరులో అమలు చేసిన క్రాక్ బ్యాండ్ మెకానిజం (బ్యారెల్ 12-22 డాలర్లు) తరహాలో.. ఏటీఎఫ్‌కు పారదర్శక ధరల విధానాన్ని తీసుకురావాలని తెలిపాయి. దేశంలోని ప్రధాన విమానయాన కేంద్రాల్లో, ఏటీఎఫ్‌పై వ్యాట్ (విలువ జతచేరిన పన్ను) అత్యధికంగా ఉండటమూ భారంగా మారింది. తమిళనాడులో అత్యధికంగా 29% కాగా, దిల్లీలో 25% విధిస్తున్నారు. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతాల్లో 16-20% మధ్య వ్యాట్ ఉంది.

# సెన్సెక్స్ 600 పాయింట్లు పైకి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. తర్వాత లాభాల స్వీకరణతో మోస్తరు లాభాలకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 77,245.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,886.91) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,982.51 పాయింట్ల వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. చివరికి 609.45 పాయింట్ల లాభంతో 77,496.36 వద్ద ముగిసింది. నిఫ్టీ 181.95 పాయింట్ల లాభంతో 24,177.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఇండిగో, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 114 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4569 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# ఒపెక్ నుంచి యూఏఈ ఎగ్జిట్..

చమురు ఎగుమతి దేశాల సమాఖ్య అయిన ఒపెక్, ఒపెక్+ నుంచి నిష్క్రమించనున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) ప్రకటించడం చర్చనీయాంశం అయ్యింది. దీనివల్ల ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందన్న దానిపై ఆసక్తి నెలకొంది. అయితే, ఒకరకంగా భారత్‌కు కలిసొచ్చే అంశమని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ అన్నారు. దిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం గురించి ఇప్పుడే ఓ అంచనాకు రాలేమని సాగర్ అదానీ అన్నారు. ప్రపంచ ఆయిల్ మార్కెట్ ఒడుదొడుకులు ఎదుర్కొంటుందా? స్థిరత్వం సాధిస్తుందా? అనే దానికి కాలమే సమాధానం చెప్తుందన్నారు. అదే సమయంలో యూఏఈతో భారత్‌కు ఉన్న మంచి సంబంధాల దృష్ట్యా మనకు లాభించే అవకాశం ఉందన్నారు. భారత్ కోణంలో చూస్తే ఈ పరిణామం వల్ల మేలు జరుగుతుందని, ప్రపంచ మార్కెట్ కోణంలో చూడాల్సివస్తే ఇప్పుడే తుది నిర్ణయానికి రాలేమన్నారు. ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల భవిష్యత్‌లో ప్రపంచ చమురు మార్కెట్‌లోకి క్రూడాయిల్ సరఫరా పెరుగుతుందని కోటక్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు మెరుగుపడ్డాక సరఫరా పుంజుకొంటుందని చెప్పారు. అలాగే, భారత్, యూఏఈ మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడనున్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చమురు కొనుగోళ్లకు రూపాయిల్లో చెల్లింపుల్లో వేగం పుంజుకొనే అవకాశం ఉందన్నారు. డాలర్లకు బదులుగా భారతీయ రూపాయిల్లో చమురు కొనుగోలు చేసే అవకాశం పెరుగుతుందని బెనర్జీ పేర్కొన్నారు.



### 5 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి వృద్ధి



దిల్లీ: దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు ఈ ఏడాది మార్చిలో 4.1 శాతంగా నమోదైంది. ఇది అయిదు నెలల కనిష్ఠం. గతేడాది మార్చిలో ఇది 3.9% కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.2 శాతంగా నమోదైంది. తయారీ రంగ ఉత్పత్తి వృద్ధి స్తబ్దుగా ఉండటం, విద్యుదుత్పత్తి వృద్ధి నెమ్మదించడం ఇందుకు కారణం. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధిని లెక్కిస్తారు. 2025 అక్టోబరులో నమోదైన 0.5% తర్వాత.. 2026 మార్చిలోని 4.1 శాతమే తక్కువ. తయారీ రంగంలోని 23 పారిశ్రామిక విభాగాల్లో 14 విభాగాలు మార్చిలో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. ఇందులో బేసిక్ మెటల్స్, మోటార్ వెహికల్స్-ట్రెయిలర్స్- సెమీ ట్రెయిలర్స్, యంత్రాలు- సామగ్రి విభాగాలు ముందు వరుసలో ఉన్నాయి.

# కెరీర్ వృద్ధికి అగ్రస్థానంలో ఇన్ఫోసిస్




దిల్లీ: లింక్డ్ఇన్ '2026 టాప్ కంపెనీస్' జాబితా ప్రకారం, మన దేశంలో ఉద్యోగుల కెరీర్ వృద్ధికి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ అగ్రగామి కంపెనీగా నిలవగా, దాని తర్వాత స్థానాల్లో యాక్సెంచర్, అమెజాన్ నిలిచాయి. 25 పెద్ద కంపెనీలతో రూపొందించిన ఈ వార్షిక జాబితా 10వ ఎడిషన్‌లో, టెక్నాలజీ దిగ్గజాలు, గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థలు, ఆర్థిక దిగ్గజాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. జేపీ మోర్గాన్ చేజ్, ఎస్‌ఏపీ వరుసగా నాలుగు, అయిదు స్థానాలు దక్కించుకున్నాయి.

2026 జాబితాలో 10 సంస్థలు కొత్తగా చేరాయి. వీటిలో ముఖ్యమైన కొత్త చేర్పులలో ఎస్‌ఏపీ, ఎన్విడియా, హెచ్‌పీ, మైక్రోసాఫ్ట్, శాన్‌డిస్క్, మార్వెల్ టెక్నాలజీ, థామ్సన్ రాయిటర్స్ వంటి టెక్ సంస్థలున్నాయి. భౌగోళికంగా ఈ అగ్ర శ్రేణి కంపెనీలకు బెంగళూరు ప్రముఖ కేంద్రంగా ఉంటోంది. హైదరాబాద్ తర్వాత స్థానంలో ఉంది. దిల్లీ, ముంబయి, చెన్నై పెద్ద కార్పొరేషన్లకు కీలక నియామక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) భర్తీ చేయలేని కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం వంటి మానవ నైపుణ్యాలతో సాంకేతిక ప్రావీణ్యాన్ని మిళితం చేయగల నిపుణుల కోసం కంపెనీలు ఎక్కువగా చూస్తున్నాయని పేర్కొంది.

నియామక సంస్థలు కేవలం ఉద్యోగుల ఉనికిని మాత్రమే కాకుండా, వారి నైపుణ్యాలకు సంబంధించిన రుజువులను కూడా చూస్తున్నట్లు అగ్ర శ్రేణి కంపెనీల జాబితా వెల్లడిస్తోందని లింక్డ్ఇన్ కెరీర్ ఎక్స్‌పర్ట్, ఇండియా సీనియర్ మేనేజింగ్ ఎడిటర్ నిరాజితా బెనర్జీ వెల్లడించారు.




## అదిరిపోయే కౌంటర్ ఇచ్చిన వైభవ్



టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో అదరగొడుతున్నాడు. బౌలర్ ఎవరనేది సంబంధం లేకుండా క్రీజులోకి వచ్చిరావడంతోనే భారీ షాట్లతో విరుచుకుపడుతున్నాడు. ఇటీవల సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో 36 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు ఇప్పటివరకు ఈ ఐపీఎల్‌లో 9 మ్యాచ్‌ల్లో 400 పరుగులు చేసి అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. వైభవ్ ఆటను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది దిగ్గజ క్రికెటర్లు ప్రశంసిస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన క్రికెట్ విశ్లేషకుడు నౌమాన్ నియాజ్ మాత్రం ఎలాంటి ఆధారాలు లేకుండా వైభవ్ సూర్యవంశీ బ్యాట్‌లో ఏఐ చిప్ ఉండొచ్చంటూ నోరుపారేసుకున్నాడు. ఈ విమర్శలకు వైభవ్ గట్టిగానే బదులిచ్చాడు. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం తనపై ఆరోపణల గురించి సూర్యవంశీని అడగ్గా.. ''ఆ దేవుడే బ్యాటులో ఏదో పెట్టాడు. నీ బ్యాట్‌లో ఏదో ఇస్తున్నానని భగవంతుడు పైనుంచి ముందే చెప్పాడు. నేను ఆ బ్యాట్‌నే వినియోగిస్తున్నాను'' అంటూ ఘాటైన సమాధానమిచ్చి విమర్శలకు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చాడు.

# ఐపీఎల్-19లో పంజాబ్‌కు తొలి ఓటమి

ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్రకు తెరపడింది. గత మ్యాచ్‌లో 265 పరుగుల లక్ష్యం ముందున్నా విజయాన్ని వదిలిపెట్టని పంజాబ్ కింగ్స్.. మంగళవారం రాజస్థాన్‌కు తలవంచింది. బ్యాటింగ్‌లో సమష్టిగా సత్తా చాటిన రాయల్స్ 223 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి ఛేదించింది. యశస్వి జైస్వాల్ (51; 27 బంతుల్లో 7×4, 1×6), వైభవ్ సూర్యవంశీ (43; 16 బంతుల్లో 3×4, 5×6) జట్టుకు బలమైన పునాది వేయగా.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డొనోవన్ ఫెరీరా (52 నాటౌట్; 26 బంతుల్లో 6×4, 3×6) విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. రియాన్ పరాగ్ (29; 16 బంతుల్లో 2×4, 2×6), శుభమ్ దూబె (31 నాటౌట్; 12 బంతుల్లో 3×4, 2×6) విలువైన పరుగులు చేశారు. మొదట పంజాబ్ 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. స్టాయినిస్ (62 నాటౌట్; 22 బంతుల్లో 4×4, 6×6), ప్రభ్‌సిమ్రన్ (59; 44 బంతుల్లో 6×4, 1×6) మెరిశారు. 8 మ్యాచ్‌లాడిన పంజాబ్‌కు ఇదే తొలి ఓటమి. ఆ జట్టు ఆరు విజయాలు సాధించగా, ఒక మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. 9 మ్యాచ్‌లు ఆడిన రాజస్థాన్‌కు ఇది ఆరో గెలుపు. వైభవ్ మొదలెడితే.. ఫెరీరా ముగించాడు: లక్ష్యం పెద్దదైనప్పటికీ.. ప్రణాళికబద్ధంగా ఆడిన రాయల్స్ అలవోకగా విజయాన్నందుకుంది. కాసేపు నిలబడ్డా ఎంతో నష్టం చేసే వైభవ్ సూర్యవంశీ ఛేదనలో జట్టుకు బలమైన పునాది వేశాడు. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లో మొదటి బంతికి యశస్వి సింగిల్ తీస్తే.. రెండు బంతులు డాట్స్ ఆడిన వైభవ్.. చివరి మూడు బంతులకు 6, 4, 4 బాదేశాడు. ఫెర్గూసన్ వేసిన రెండో ఓవర్లోనూ మొదటి బంతికి జైస్వాల్ సింగిల్ తీస్తే.. వైభవ్ రెండు బంతులకు పరుగులు తీయలేదు. కానీ చివరి 3 బంతులకు మాత్రం 4, 6, 6 కొట్టేశాడు. చూస్తుండగానే 40ల్లోకి వచ్చేసిన అతను, అర్ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్లో ఔటైనప్పటికీ.. రాయల్స్ స్కోరు వేగం తగ్గలేదు. సూర్యవంశీ ఔటయ్యాక జైస్వాల్ అందుకుని భారీ షాట్లు ఆడాడు. పవర్‌ప్లేలో రాయల్స్ 84/1తో నిలిచింది. ఈ దశలో స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్, చాహల్ పొదుపుగా బౌలింగ్ చేశారు. చాహల్ వరుస ఓవర్లలో జురెల్ (16), యశస్విలను ఔట్ చేసి రాయల్స్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న పరాగ్ సైతం చాహల్‌కే వికెట్ సమర్పించుకోవడంతో మ్యాచ్ పంజాబ్ వైపు మొగ్గుతున్నట్లు కనిపించింది. అయితే 6 ఓవర్లలో 72 పరుగులు చేయాల్సిన స్థితిలో ఫెరీరా రాయల్స్ హీరోగా మారాడు. పంజాబ్ ప్రధాన బౌలర్లు అర్ష్‌దీప్, ఫెర్గూసన్, యాన్సెన్‌లను ధాటిగా ఎదుర్కొన్న అతను.. భారీ షాట్లతో మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పేశాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శుభమ్ దూబె సైతం సమయోచితంగా షాట్లు ఆడడంతో రాయల్స్ పని తేలికైపోయింది. చివరి ఓవర్ రెండో బంతికి సిక్సర్ బాదిన ఫెరీరా మ్యాచ్‌ను ముగించడంతో పాటు అర్ధశతకం కూడా పూర్తి చేశాడు. మెరిసిన స్టాయినిస్, ప్రభ్‌సిమ్రన్: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పంజాబ్.. సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ మరోసారి భారీ స్కోరు సాధించింది. ఎప్పట్లాగే ఓపెనర్లు జట్టుకు బలమైన పునాది వేయగా.. ఆఖర్లో మార్కస్ స్టాయినిస్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టుకు పెద్ద స్కోరు సాధించి పెట్టాడు. ప్రియాంశ్ ఆర్య (29; 11 బంతుల్లో 5×4, 1×6) పంజాబ్‌కు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. బర్గర్ వేసిన రెండో ఓవర్లో అతను వరుసగా 4, 6, 4, 4 కొట్టాడు. తర్వాతి ఓవర్లో ఆర్చర్.. ప్రియాంశ్‌ను ఔట్ చేసినప్పటికీ.. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్, కనోలీ (30; 14 బంతుల్లో 2×4, 3×6) ధాటిగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో 8 ఓవర్లకే పంజాబ్ 95/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. స్పిన్నర్ యశ్‌రాజ్ పుంజా.. తర్వాతి ఓవర్లో కనోలీని ఔట్ చేసి స్కోరు వేగానికి బ్రేకులేశాడు. గత మ్యాచ్‌లో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన కెప్టెన్ శ్రేయస్ (30; 27 బంతుల్లో 1×4, 1×6) ఈ మ్యాచ్‌లో తడబడ్డాడు. మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న ప్రభ్‌సిమ్రన్.. అర్ధశతకం తర్వాత ఔటయ్యాడు.



# నేను ట్రావిస్ హెడ్‌ను అడిగిన మొదటి ప్రశ్న అదే: అభిషేక్ శర్మ



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్, ప్రపంచ నంబర్ వన్ టీ20 బ్యాటర్ అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ శైలిని ట్రావిస్ హెడ్ ఎలా ప్రభావితం చేశాడో వెల్లడించాడు. హెడ్ అగ్రెసివ్ మైండ్‌సెట్ ఐపీఎల్‌లో తన ఆటను ఏ విధంగా తీర్చిదిద్దిందో అభిషేక్ తెలిపాడు. ''ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్‌లో చేరడానికి ఏడాదిన్నర ముందు నుంచే అతని ఆటను గమనిస్తున్నా. అతను నా సహచరుడిగా మారినప్పుడు నేను చాలా సంతోషించాను. నేను హెడ్‌ని అడిగిన మొదటి ప్రశ్న అతని బ్యాటింగ్ ఆలోచనా విధానం గురించే. అతను మూడు ఫార్మాట్లలోనూ రాణించి బౌలింగ్‌పై ఆధిపత్యం చెలాయించే తీరు నచ్చింది. అతను నాతో తన ప్రణాళిక చాలా సింపుల్ అని చెప్పాడు. బంతిని నిశితంగా గమనించాలన్నాడు. ఒకవేళ మొదటి బంతిని కొట్టగలనని అనిపిస్తే వెంటనే ప్రయత్నించాలన్నాడు. ఐపీఎల్‌కు ముందు నా ప్రాక్టీస్‌లో హెడ్ ఇచ్చిన సలహాలను పాటించా. ఇప్పుడు వాటిని అనుసరిస్తున్నాను'' అని అభిషేక్ వివరించాడు. ఐపీఎల్‌లో తన అనుభవం గురించి కూడా అభిషేక్ మాట్లాడాడు. ''ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ క్రికెటర్లందరినీ ఈ టోర్నీ ఒకచోట చేర్చుతుంది. ఇది అగ్రశ్రేణి టీ20 లీగ్ ఇక్కడ ఆడే అవకాశం లభించడం ఒక అదృష్టంగా భావిస్తాను. అగ్రశ్రేణి ఆటగాళ్లతో కలిసి ఆడటం, ఇతర జట్లలో ఉన్న గొప్ప ప్లేయర్లతో తలపడటం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు'' అని అభిషేక్ పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో అభి.. ఇప్పటివరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు చేశాడు. వైభవ్ సూర్యవంశీ (400) తర్వాత సెకండ్ లీడింగ్ స్కోరర్ (380 రన్స్)గా ఉన్నాడు.

# నేను ఇంకా చాలా చిన్నవాడినే..

పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ విజయం సాధించడంలో ఓపెనర్లు యశస్వి జయస్వాల్ (51), వైభవ్ సూర్యవంశీ (43) కీలక పాత్ర పోషించారు. తాజా ఇన్నింగ్స్‌తో ఈ సీజన్‌లో వైభవ్ 400 రన్స్‌కు చేరుకొని తిరిగి లీడింగ్ స్కోరర్‌గా నిలిచాడు. మ్యాచ్ అనంతరం తన సహచర ఆటగాడు యశస్వి చేతులమీదుగా వైభవ్ 'ఆరెంజ్ క్యాప్'ను అందుకున్నాడు. ఈక్రమంలో ఓ సీనియర్ ఆటగాడిగా టీనేజర్‌తో కలిసి ఆడటం ఎలా అనిపిస్తోందని జయస్వాల్‌ను బ్రాడ్‌కాస్టర్ పామీ మ్బాంగ్వా అడిగారు. తనను సీనియర్ అని పిలవడంతో యశస్వి ఒకింత ఆశ్చర్యానికి గురై తర్వాత స్పందించాడు. 'నేను పెద్దవాడినని నేనైతే అనుకోవడం లేదు. నేను ఇంకా చాలా చిన్నవాడినే. కాకపోతే నాకంటే వైభవ్ సూర్యవంశీ చాలా చిన్నోడు. దీని గురించి ఏం మాట్లాడాలో తెలియడం లేదు. వైభవ్‌తో కలిసి బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. అతను అద్భుతంగా ఆడుతున్నాడు. అవతలి ఎండ్‌లో నిలబడి ఈ కుర్రాడు నిర్భయంగా బంతిని కొట్టే విధానాన్ని చూసి నేను ఎప్పుడూ సంతోషిస్తాను'' అని జయస్వాల్ అన్నాడు.



తన బ్యాటింగ్ గురించి కూడా యశస్వి మాట్లాడాడు. ''ఇది భారీ స్కోర్లు నమోదయ్యే మైదానమని మాకు ముందే తెలుసు. కాబట్టి, మేము మా దూకుడును కొనసాగించాలి. అలాగే మాకు సరైన అవకాశం దొరికినప్పుడల్లా ధైర్యంగా షాట్లు ఆడాలి. అందుకే నేను కూడా సరే చెత్త బంతులు వస్తే వదలకుండా బాదేయాలని అనుకున్నా. పైగా మేం 200కు పైగా పరుగులు సాధించాల్సిఉంది. కాబట్టి మాకు ఒక మంచి ఆరంభం లభించడం ముఖ్యం'' అని పేర్కొన్నాడు.

# వినోద్ కాంబ్లీ ఐస్‌క్రీమ్ యాడ్‌పై విమర్శలు




భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ (Vinod Kambli) ఇటీవల ఓ ఐస్‌క్రీమ్ బ్రాండ్ యాడ్‌లో నటించారు. ఈ ప్రకటనలో కాంబ్లీ వ్యక్తిగత జీవితాన్ని ప్రస్తావించడంపై నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వినోద్ కాంబ్లీ తీవ్ర అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. అప్పటినుంచి ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే మొదటిసారి. దీంతో కాంబ్లీ దృఢ సంకల్పం, కమ్‌బ్యాక్‌ను ఉద్దేశిస్తూ ఐస్‌క్రీమ్ యాడ్‌ను రూపొందించారు. ఈ మాజీ ప్లేయర్ పాత క్రికెట్ జ్ఞాపకాలను గుర్తుచేస్తూ జీవితంలో 'కొంచెం తక్కువ' పొందిన వారు 'కొంచెం ఎక్కువ' పొందడానికి అర్హులు అనే కాన్సెప్ట్‌తో ఈ యాడ్‌ను చిత్రీకరించారు. అయితే, కొంత మంది నెటిజన్లు ఈ వాణిజ్య ప్రకటనను తప్పుపడుతున్నారు. కాంబ్లీ జీవిత కథను తమ మార్కెటింగ్‌కు వినియోగించుకుంటున్నారని విమర్శలు చేస్తున్నారు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## దూరదర్శిని హృదయాలకు హత్తుకుంటుంది



**వుదయం సినిమా :** సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి. ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని పనులను పూర్తిచేసుకున్న ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం చిత్రలహరి మీట్‌ను బుధవారం హైదరాబాద్‌లో జరిగింది.

## ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్ టీజర్



**వుదయం సినిమా :**'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమా నుంచి ఎలాంటి కంటెంట్ రాబోతుందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరిగింది. ఈ చిత్రం ఒక హృద్యమైన అనుభూతిని అందిస్తుందని వాగ్దానం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'సంచారమే' అద్భుతమైన స్పందనను సొంతం చేసుకోగా, తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో అంచనాలను అమాంతం పెంచేసింది. 'ఎపిక్' టీజర్ అందమైన అనుభూతిని అందిస్తూ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యల మధ్య కథను కేంద్రీకరిస్తుంది. 'బేబీ' సినిమా తర్వాత ఈ జంటకు ఇప్పటికే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు ఈ హిట్ పెయిర్ సరికొత్తగా మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది.



90's వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ సినిమాతో వెండితెరపై అడుగుపెడుతున్నారు. తాజాగా విడుదలైన టీజర్, మొదటి సినిమాతోనే ఆయన ఘన విజయాన్ని ఖాతాలో వేసుకోబోతున్నారనే నమ్మకాన్ని కలిగిస్తోంది.

## జూన్ 26న లెనిన్



**వుదయం సినిమా :** యంగ్ అండ్ డైనమిక్ యాక్టర్ అఖిల్ అక్కినేని నెక్స్ట్ మూవీ 'లెనిన్' సినిమా నుంచి ఇప్పటి వరకు 'వారెవా వారెవా..', 'ఎట్టా ఎట్టా..' అనే రెండు సాంగ్స్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ రెండు చార్ట్‌బస్టర్ సాంగ్స్ మంచి హైప్‌ను క్రియేట్ చేశాయి. మ్యూజికల్ సెన్సేషనల్ తమన్ సంగీత సారథ్యంలో విడుదలైన ఈ పాటలు అందరి దృష్టిని ఆకర్షించి సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇటీవల కింగ్ నాగార్జున.. లెనిన్ మూవీ ఫస్ట్ కాపీని చూసి సినిమా అవుట్‌పుట్‌తో పాటు టీమ్ పనితీరుపై చాలా ఇంప్రెస్ అయ్యారు. అంతే కాకుండా, నిన్న సినిమా చూశానని, ఎంతో నచ్చిందని బుధవారం రోజున తన ఎక్స్ అకౌంట్ (ట్విట్టర్)లో ట్వీట్ ద్వారా తెలియజేశారు. ఈ సినిమాతో జూన్ 26న థియేటర్లలో ప్రేక్షకులు 'కొత్త అఖిల్'ను చూడబోతున్నారనే కూడా ఆయన హామీ ఇచ్చారు. 'టాక్సిక్' సినిమా పూర్తయింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్త పంపిణీ, భాగస్వామ్యాలను కాంటాక్ట్ అవుతున్నాం. ఈ నేపథ్యంలో మేము మా విడుదల తేదీని పునఃసమీక్షించాలని నిర్ణయించుకున్నాము. గతంలో ప్రకటించినట్లుగా మేము జూన్ 4న విడుదల చేయలేకపోతోన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన తదుపరి విడుదల తేదీని త్వరలోనే చెబుతాం. 'టాక్సిక్' త్వరలో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## ఫస్ట్ టైం ట్రైలర్ లాంచ్



**వుదయం సినిమా :** హేమంత్ ఇప్పలపల్లి కథ రాసుకుని తానే దర్శక నిర్మాతగా వ్యవహరిస్తూ తక్కువ బడ్జెట్ తో నిర్మిస్తున్న సినిమా అయినా భారతదేశంలోనే అతిపెద్ద ప్రతిష్టాత్మక వి ఎఫ్ ఎక్స్ సినిమాగా నిర్మించబడుతున్న "ఫస్ట్ టైం" సినిమాకి సంబంధించిన ట్రైలర్ ఈనెల 28న ముఖ్యఅతిథిగా విచ్చేసిన అగ్ర నటి అందాల తార పాయల్ రాజ్ పుత్ చేతుల మీదగా ట్రైలర్ లాంచ్ ఘనంగా జరిగింది. ఈ సినిమాలో సౌరబ్ ధింగ్ర హీరోగా పరిచయం అవుతుండగా 'బిగ్ బాస్' ఫేమ్ అఖిల్ సార్థక్ సెకండ్ లీడ్‌గా అనిక్క విక్రమన్ హీరోయిన్‌గా ఇతర ముఖ్యపాత్రల్లో మైమ్ గోపి, శివ, భూపాల్ రాజు, గాయత్రి గుప్త, అన్నపూర్ణమ్మ, అజయ్ రత్నం, ఢీ పండు నటిస్తున్నారు. శ్రీ వెంకట్ మరియు సూరజ్ ఎస్ కురుప్ సంగీతాన్ని అందించగా వేణు మురళీధర్ మరియు రామ్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేశారు. చెప్పుకోడానికి చిన్న బడ్జెట్ సినిమా అయినా టెక్నికాలిటీస్, విజువల్స్ పరంగా ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా చాలా గ్రాండ్ గా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు హేమంత్ ఇప్పలపల్లి. ఎఐ ని ఎక్కడ ఇన్వాల్వ్ చేయకుండా హెచ్‌ఐ తో హై రేంజ్ గ్రాఫిక్స్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్ లాంచ్ ఘనంగా జరిగింది. ఈవెంట్ కి అతిథులుగా సీనియర్ నిర్మాత దర్శకుడు బెల్లం రామకృష్ణ రెడ్డి గారు, బిజెపి స్పోక్స్ పర్సన్ ప్రభ గౌడ్ గారు, జి చీఫ్ ఎడిటర్ భరత్ కుమార్ గారూ, హీరో అభినవ్ శౌర్య విచ్చేయగా ముఖ్యఅతిథిగా అందాల తార పాయల్ రాజ్ పుత్ విచ్చేశారు.

## టాక్సిక్ కు అద్భుతమైన స్పందన




**వుదయం సినిమా :** కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై రూపొందిన 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' విడుదల తేదీని మళ్లీ మార్చినట్లు మేకర్స్ ఈరోజు ప్రకటించారు. జూన్ 4, 2026న విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రం రిలీజ్ డేట్ మారనుంది. త్వరలోనే ఈ కొత్త డేట్‌ను ప్రకటించనున్నారు. సినిమాకాన్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించిన తర్వాత మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ప్రపంచవ్యాప్త డిస్ట్రిబ్యూటర్స్, పరిశ్రమ భాగస్వాముల నుండి 'టాక్సిక్'కి అద్భుతమైన స్పందన లభించింది. ఈ స్పందనను చూసిన మేకర్స్ ఈ చిత్రాన్ని మరింత విస్తృత అంతర్జాతీయ విడుదలకు అవకాశాలను కల్పించాలని, తమ ప్లానింగ్‌స్‌ను, రిలీజ్ డేట్‌లను పునఃసమీక్షించుకుంటున్నారు. టాక్సిక్' వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకులందరికీ చేరేలా నిర్మాతలు ప్లానింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్త పంపిణీని ఖరారు చేయడం, కీలకమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడంపై ఫోకస్ పెట్టారు. ఈ చిత్రానికి యష్, గీతూ మోహన్‌దాస్ రచన చేయగా.. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. "మేము సాధారణంగా తీసే సినిమాలు కొన్ని ఉంటాయి, మరికొన్ని సినిమాలు అసలు మనం సినిమాను ఎందుకు ప్రేమించామో గుర్తు చేస్తాయి. 'టాక్సిక్' అలాంటి ఒక ప్రయాణమే. సినిమాకాన్‌లో మా చిత్రాన్ని ప్రదర్శించిన తరువాత.. అక్కడ వచ్చిన స్పందనను చూసిన తరువాత.. ఇది వరల్డ్ వైడ్‌గా అందరికీ చేరాల్సిన సినిమా అని మాకు అర్థమైంది.

## కర విజయం తథ్యం
### సీహెచ్. సతీష్ కుమార్



**వుదయం సినిమా :** ధనుష్, మమితా బైజు జంటగా కుష్మిత గణేష్ సమర్పణలో డా. ఐషరి కె. గణేష్ నిర్మించిన చిత్రం 'కర'. ఈ మూవీకి విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఏప్రిల్ 30న విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్ అధినేత సీహెచ్. సతీష్ కుమార్ మీడియాతో చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆయన ఏం చెప్పారంటే.. * మాది విశాఖపట్నం. చిన్న సినిమాల్ని కొంటూ డిస్ట్రిబ్యూషన్ స్టార్ చేశాను. ఆ తరువాత ఓ మూవీని కూడా నిర్మించాను. 'అర్జున్ రెడ్డి', 'కబాలి', 'సింగం 3', 'సలార్', 'కాంతారా చాప్టర్ 1' వంటి సినిమాల్ని ఉత్తరాంధ్రలో డిస్ట్రిబ్యూషన్ చేశాను. ధనుష్ గారి 'ధర్మయోగి' సినిమాని తెలుగులో రిలీజ్ చేశాను. ప్రొడక్షన్‌లోనూ మంచి సినిమాల్ని చేయాలని అనుకుంటున్నాను. ఈ 'కర' మూవీ కోసం నా స్నేహితుడు రాజేష్ సపోర్ట్ తీసుకున్నాను.

* ధనుష్ గారికి మంచి మార్కెట్ ఉంది. ఇందులో మంచి కంటెంట్ ఉందని నాకు నమ్మకం ఉంది. ఈ మూవీ గొప్ప విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను. 'కుబేర' మంచి విజయం సాధించింది. 'ఇడ్లీకొట్టు'ని తెలుగులో సరిగ్గా ప్రమోట్ చేయలేదనిపిస్తుంది. 'రాయన్' తెలుగు వారికి రీచ్ అయింది. ఈ 'కర' మూవీని నా శక్తి మేరకు తెలుగు ప్రేక్షకుల వద్దకు తీసుకు వెళ్తాను.

## జెట్లీ ఎంటర్ టైనర్, కామెడీ థ్రిల్లర్ నిర్మాత చెర్రీ



**వుదయం సినిమా :** టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ) హేమలత పెద్దామల్లు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా కథానాయికగా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తున్నారు. వెన్నెల కిషోర్, అజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్ తో మంచి బజ్ క్రియేట్ చేశాయి. 'జెట్లీ' మే 1న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత చెర్రీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**డైరెక్టర్ రితేష్ గారు ఈ కథ చెప్పినప్పుడు మీకు నచ్చిన ఎలిమెంట్స్ ఏమిటి?**

ఇది పూర్తిగా డిఫరెంట్ సబ్జెక్ట్. దాదాపు 80 శాతం సినిమా ఫ్లైట్‌లోనే జరుగుతుంది. అది చాలా ఇంట్రెస్టింగ్ పాయింట్. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకు ఒక సినిమా అంతా ఫ్లైట్‌లో జరిగినట్లు లేదు. రితేష్ ఎప్పుడూ డిఫరెంట్ కథలతో వస్తాడు. తను కథ చెప్పినప్పుడే నాకు చాలా నచ్చింది. మా మధ్య మంచి అనుబంధం ఉంది. అతన్ని మా అబ్బాయిలా చూస్తాను. తనకీ కృతజ్ఞత వుంటుంది. తను చెప్పే కథల్లో చాలా వరకు నాకు నచ్చుతాయి. తనతో పని చేయడం చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది.

**జెట్లీ సినిమాను ముందుగా పెద్ద హీరోతో చేయాలనుకున్నారట?**

మొదట ఈ సినిమాను సీరియస్ థ్రిల్లర్‌గా చేయాలనుకున్నాం. కథ డెవలప్ చేశాం. కొంతమంది హీరోలకు చెప్పినా, వారికి తగ్గట్టుగా ఈ కథ కుదరలేదు. ఇది రెగ్యులర్ హీరో సినిమా కాదు. అందుకే రితేష్ దీన్ని కామెడీ థ్రిల్లర్‌గా మార్చాడు.

**సినిమాల విషయంలో మీ జడ్జ్‌మెంట్ ఎలా ఉంటుంది?**

ఆడియన్స్‌కు ఏది నచ్చుతుందో ముందుగా ఎవరూ చెప్పలేరు. కానీ మనం కథ ఎంచుకునేటప్పుడు కొత్తదనం ఉండేలా చూసుకోవచ్చు. కథ కొత్తగా వుంటే రిస్క్ తీసుకుని ఎక్స్ పెరిమెంట్ చేయొచ్చు.

## శ్రీనివాస మంగాపురం అలెల్లె అలెల్లె

**వుదయం సినిమా :** సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' ప్రాజెక్ట్ తో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. అశ్విని దత్ సమర్పణలో, చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. నేచురల్ స్టార్ నాని ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ 'అలెల్లె అలెల్లె'ను లాంచ్ చేశారు.



## గాయపడ్డ సింహం
### పెద్ద సక్సెస్ అవుతుంది



**వుదయం సినిమా :**'గాయపడ్డ సింహం' సినిమా అద్భుతంగా వచ్చింది. ఇందులో నా కోసం క్రియేట్ చేసిన క్యామియో రోల్ యూనిక్ టైమింగ్ తో ఉంటుంది: కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. గాయపడ్డ సింహం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ విసా స్టాపింగ్ ఈవెంట్ నిర్వహించారు.

## జూన్ 5న అనకాపల్లి



**వుదయం సినిమా :** డిఫరెంట్ కంటెంట్‌తో, రా అండ్ రస్టిక్‌గా భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన కూడా ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. ఈ మూవీని జూన్ 5న విడుదల చేయనున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేయగా అది అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేసింది. ఇక తాజాగా 'అనకాపల్లి' నుంచి జాతర సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ పాటలో సంగీత స్టెప్పులు, గ్రాండియర్‌గా పాటను తెరకెక్కించిన తీరు, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ, మంగ్లీ గాత్రం ఇలా అన్నీ హైలెట్‌గా నిలుస్తున్నాయి. నిజంగానే ఓ జాతర చూస్తున్నామా? అన్న రేంజ్‌లో విజువల్స్ కనిపిస్తున్నాయి. ఇక ఈ పాటకు గణేష్ సలాది లిరిక్స్, దేవజండ్ బాణీ మరింత స్పెషల్ అట్రాక్షన్‌తా నిలిచాయి.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.